మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 50 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



# పదేళ్లుగా మోడీ చేసిందేమీ లేదు

- విభజన హామీలు తుంగలో తొక్కారు
- బయ్యారం ఉక్కు, కోచ్ ఫ్యాక్టరీ తరలింపు
- బిజెపి ఎజెండాలో రాజ్యాంగం రద్దు..రిజర్వేషన్ల రద్దు
- కులగణన చేపట్టకుండా చేయడంలో ఆంతర్యమిదే
- 400 సీట్ల వెనక భారీ కుట్ర దాగివుంది
- లక్షల కోట్ల నిధులు గుజరాత్‌కు తరలింపు
- రిజర్వేసన్లు ఉండాలంటే కాంగ్రెస్ గెలవాలి
- ధర్మపురి సభలో సిఎం రేవంత్ రెడ్డి పిలుపు



**ధర్మపురి/రాజన్న సిరిసిల్ల (ప్రజా మంటలు):** పదేళ్లుగా మోడీ తెలంగాణకు చేసిందేమీ లేదని..రేపు మరేదో చేస్తారన్న ఆశా లేదని ప్రధాని మోదీపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని మార్చడం, రిజర్వేషన్లను రద్దచేయడమే లక్ష్యంగా బిజెపి పనిచేస్తోందని అన్నారు. అందుకే కులగణన, జనాభా లెక్కల సేకరణ గత పదేళ్లుగా చేపట్టలేదని రేవంత్ రెడ్డి అన్నారు. బిజెపి ఎజెండా మేరకు ముందుకు సాగుతోందని సిఎం విమర్శలు చేశారు. ధర్మపురిలో జరిగిన జనజాతర సభలో సిఎం మాట్లాడారు. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ధర్మపురిలో నిర్వహించిన జనజాతర సభలో సీఎం ప్రసంగించారు. మోదీ వాట్సప్ యూనివర్సిటీని నడుపుతున్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి మంత్రిగా ఉండి తెలంగాణకు ఏం తెచ్చారని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు, వరంగల్ రైల్వే కోచ్ ఏం చేశారని నిలదీశారు. అబద్దాల పోటి పెడితే బీజేపీ నేతలతో ఎవ్వరూ పోటీ పడలేరని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతలు అబద్దాలు చెప్పడంలో పీహెడీ చేశారని ఆరోపించారు. తెలంగాణకు ఏం చేయని బీజేపీ లక్షల కోట్ల నిధులు గుజరాత్ కు తీసుకెళ్లారని ఆరోపించారు. పదేళ్లు ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి రావాలని 400 సీట్లు కావాలని అడుగుతున్నారని చెప్పారు. ఆ 400 సీట్లు రాజ్యాంగాన్ని మార్చడం కోసమే అడుగుతున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ చూస్తుందని అందుకే 8 రాష్ట్రాల ప్రభుత్వాలను పడగొట్టారని తెలిపారు. 2021లో ఎందుకు జనాభా లెక్కలు చేయలేదని ప్రశ్నించారు. రిజర్వేషన్లు రద్దు చేసే అధికారం మీకు ఎవరిచ్చారని నిలదీశారు. గాంధీ కుటుంబానికి పదవులపై వ్యామోహం లేదని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే కానీ రిజర్వేషన్లు ఉండవని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచడమే కాకుండా బలహీనవర్గాల కులగణన కాంగ్రెస్ చేస్తుందని చెప్పారు. రిజర్వేషన్లే ప్రధాన అంశంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నేతకాని కార్పొరేషన్, సింగరేణి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో భారాసకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. పోటీ చేసే అభ్యర్థి లేక .. ధర్మపురి ప్రజలు తిరస్కరించిన కొప్పుల ఈశ్వర్‌నే మళ్లీ ఎంపీ అభ్యర్థిగా భారాస నిలబెట్టిందని ఆక్షేపించారు. భాజపా నేతలు నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మోదీ వాట్సాప్ వర్సిటీలో అన్నీ అబద్ధాలే ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పదేళ్లు దేశ ప్రధానిగా ఉన్న మోదీ, ఐదేళు కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. విభజనచట్టంలో సోనియాగాంధీ ఇచ్చిన బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని కాలగర్భంలో కలిపేశారన్నారు. కాజీపేటకు ఇచ్చిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని లాతూర్‌కు తరలించుకుపోయారని ఆరోపించారు. నాలుగువేల మెగావాట్ల సామర్థ్యంలో ఎన్‌టీపీసీ విద్యుత్ ఉత్పత్తి సంస్థను నిర్మించాల్సింది. పదేళ్లలో 1600 మెగావాట్లతో నిర్మించారు. రంగారెడ్డి జిల్లాకు ఐటీఐఆర్ కారిడార్‌ను సోనియాగాంధీ ఇస్తే దానిని రద్దు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించకుండా మొండి చేయి చూపించారు. గిరిజన యూనివర్సిటీ, ఐఐటీ, ఐఐఎం ఇలా చెప్పుకొంటూ పోతే పెద్ద జాబితానే ఉంది. గుజరాత్‌కు మాత్రం బుల్లెట్ రైలు, సబర్మతి రివర్ ఫ్రంట్ తీసుకెళ్లారు. రూ.లక్ష కోట్ల నిధులు తరలించుకు పోయారు. గుజరాత్‌లో ఉన్నవారేనా? తెలంగాణలోఉన్న వాళ్లు మనుషులు కాదా? ఈ రాష్ట్రంపై భాజపా నేతలు సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. కులగణన చేపట్టి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పెంచాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలని భాజపా కుట్ర చేస్తోంది. 400 సీట్లు గెలిస్తే లోక్‌సభలో మూడో వంతు మెజార్టీతో రిజర్వేషన్లు రద్దు చేస్తారు. రిజర్వేషన్ల రద్దుకు దేశంలోని 50శాతం రాష్ట్రాలు ఆమోదించాలి. అందుకే 8 రాష్ట్రాల్లో

మిగతా 2లో..

## రాహుల్ నామినషన్‌కు హాజరైన రేవంత్



**లక్నో,మే3 (ప్రజా మంటలు):** సిఎం రేవంత్‌రెడ్డి రాయ్‌బరేలీకి వెళ్లారు. శుక్రవారం రాహుల్ గాంధీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. అందులో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కలిసి ముఖ్యమంత్రి రాయ్‌బరేలీకి వెళ్లారు. సోనియాగాంధీ ఇటీవల రాజ్యసభ ఎంపిగా ఎంపికవ్వగా ఆమె పోటీ చేసే స్థానం రాయ్ బరేలీ నుంచి రాహుల్ గాంధీ బరిలో నిలుస్తున్నారు. అమేథీ నుంచి కిషోర్‌లాల్ శర్మను కాంగ్రెస్ బరిలో నిలిపింది.

## స్కాముల్లో యూపిఎను మించిన మమతా బెనర్జీ

### రికార్డు సృష్టించిందని విమర్శించిన ప్రధాని మోడీ




**కొల్‌కతా,మే3 (ప్రజా మంటలు):** పశ్చిమ బెంగాల్‌లో మమత బెనర్జీ ప్రభుత్వం స్కామ్‌ల్లో రికార్డు సృష్టించిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. ఈ ప్రభుత్వంలో వివిధ రంగాల్లో స్కామ్‌లు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొంజి స్కామ్, బొగ్గు అక్రమ రవాణా స్కామ్, రేషన్ పంపిణీ స్కామ్, ఉద్యోగ నియామకాల స్కామ్‌లు ఈ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్నాయని ఆయన వివరించారు. 2004 నుంచి 2014 వరకు యూపీఏ ప్రభుత్వ హయాంలో

మిగతా 2లో..

## ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

### జూలై చివరి వారానికి వాయిదా వేసిన సుప్రీం



**న్యూఢిల్లీ,మే3(ప్రజా మంటలు):** సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడింది. తదుపరి విచారణను జూలై చివరి వారంలో నిర్వహిస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ఓటుకి నోటు కేసు విచారణను మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలన్న పిటిషన్‌పై కౌంటర్‌ను సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం ఫైల్ చేయలేదు. గత విచారణ సందర్భంగా రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం, ప్రతివాదులకు కౌంటర్ దాఖలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ ఫైల్ చేయకపోవడంతో కేసు విచారణ వాయిదా పడింది. ఓటుకి నోటు కేసు విచారణ మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పిటిషన్ వేశారు. న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ,

మిగతా 2లో..

## వీడియో కాన్ఫరెన్స్ వద్దు

### నేరుగా విచారణకు హాజరవుతా : కవిత



**న్యూఢిల్లీ,మే3(ప్రజా మంటలు):** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత జ్యూడీషియల్ కస్టడీ మే 7వ తేదీతో ముగియనుంది. దీంతో ఆమెను అధికారులు కోర్టు ముందు హాజరు పరచనున్నారు. అయితే, తనను కోర్టుకు నేరుగా హాజరుపరచాలని.. వీడియో కాన్ఫరెన్స్ వద్దని కోర్టును కవిత కోరారు. ఈ మేరకు కోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవిత విచారణ ఖైదీగా తీహార్ జైల్లో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్నారు. అయితే, గతంలో కస్టడీ ముగిసినప్పుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను అధికారులు కోర్టు ధర్మాసనం ఎదుట హాజరుపరిచారు . ఇప్పుడు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరుపరిచే అవకాశం ఉంది. దీంతో.. ఈ విచారణకు నేరుగా హాజరుపరచాలని కోరుతూ కోర్టు అప్లికేషన్ పెట్టుకున్నారు. ఈ కేసులో కవిత అరెస్టైనప్పటి నుంచి నాలుగుసార్లు కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు ధర్మాసనం పొడించింది. కోర్టుకు హాజరైన సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసే అవకాశం ఏర్పడింది. అయితే, గతంలో కోర్టులో విచారణకు హాజరైన కవిత.. మీడియాతో

మిగతా2లో..

## పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్ కొత్త మేనిఫెస్టో

- విభజన హామీల అమలు - ఏపీలో కలిసిన ఐదు మండలాలు వెనక్కి
- మేడారం జాతరకు జాతీయహోదా కల్పన - పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా - యువత, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం - పాంచ్ న్యాయ్
- పచ్చీస్ గ్యారంటీస్ పేరుతో తెలంగాణకు ప్రత్యేక మేనిఫెస్టో - గాంధీభవన్‌లో విడుదల చేసిన దీపాదాస్ మున్షీ




**హైదరాబాద్(జనంసాక్షి):** అసెంబ్లీ ఎన్నికలకు ఆరు గ్యారంటీలతో పాటు బోలెడన్ని హామీలతో మేనిఫెస్టో రిలీజ్ చేసిన కాంగ్రెస్ పార్టీ తాజాగా లోక్ సభ ఎన్నికలకు కూడా ప్రత్యేకంగా ఓ మేనిఫెస్టో రిలీజ్ చేసింది జాతీయ కాంగ్రెస్ పాంచ్ న్యాయ్ - పచ్చీస్ గ్యారంటీస్ పేరుతో ఓ మేనిఫెస్టో విడుదల చేసింది. దీన్ని తుక్కుగూడలో జరిగిన సభలో తెలుగులోనూ విడుదల చేశారు. అయితే తెలంగాణకు ఏమి చేస్తారో ప్రత్యేకంగా మేనిఫెస్టో విడుదల చేయాలనుకున్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఏమేమి చేస్తామో వివరిస్తూ.. మేనిఫెస్టోను సిద్ధం చేసి.. విడుదల చేశారు. తెలంగాణ ప్రత్యేక మ్యానిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. ఐదు న్యాయాలు, తెలంగాణకు ప్రత్యేక హామీల పేరుతో దీన్ని రూపొందించారు. మ్యానిఫెస్టో తెలుగు ప్రతిని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ

## మిత్ షా వీడియో మార్ఫింగ్ కేసు ఐదుగురికి డిషన్ బెయిల్ మంజూరు

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** కేంద్ర హోంమంత్రి అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసులో ఐదుగురు నిందితులకు బెయిల్ మంజూరు అయ్యింది. ఈకేసులో టీపీసీసీ సోషల్ మీడియా టీమ్ మెంబర్స్ పెండ్యాల వంశీకృష్ణ, మన్నె సతీష్, నవీన్, ఆస్మా తస్లీమ్, గీతలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను ఈరోజు నాంపల్లి కోర్టులో హాజరుపర్చరగా.. వారికి కోర్టు కండిషనల్ బెయిల్ మంజూరు చేసింది. పది వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు అయ్యింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు నిందితులు ప్రతీ సోమ, శుక్ర వారాలు కేసు ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్స్ ముందు హాజరు కావాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. మరోవైపు ఈ కేసుకు సంబంధించి ఢిల్లీ పోలీసులు హైదరాబాద్‌లోనే మకాం వేశారు. హస్తిన పోలీసులు నిన్నటి నుంచి హైదరాబాద్‌లోనే ఉండిపోయారు. హైదరాబాద్ పోలీసుల అదుపులో ఉన్న ఐదుగురిని అరెస్ట్ చేయాలని ఢిల్లీ పోలీసులు చూస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో

మిగతా 2లో..

## ప్రజా నాడి




## నా బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీల్లో వణుకు

- అందుకే నా ప్రచారాన్ని అడ్డుకునేందుకు కుట్రలు



**రామగుండం (ప్రజా మంటలు):** నా బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెలు వణుకుతున్నాయని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. ఇద్దరు కుమ్మక్కై నన్ను నిలువరించాలని నా ప్రచారంపై నిషేధం విధించారు అని కేసీఆర్ తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రామగుండంలో నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. 48 గంటల తర్వాత నిషేధించబడిన నా గొంతు మళ్లీ మాట్లాడుతుంది. నేను ఏం చేశానని నా గొంతును ఆపారు. ఎందుకు కోసం

మిగతా 2లో..

## కేసీఆర్ ఆదేశాల మేరకే చేశాం

- ఆయన చెప్తేనే పనులు చక్కబెట్టాం - విచారణలో రాధాకిషన్ రావు వెల్లడి
- ఫోన్ ట్యాపింగ్‌లో సంచలన విషయాలు వెలుగులోకి..
- ప్రభాకర్ రావు అరెస్ట్‌కు అనుమతివ్వండి - నాంపల్లి కోర్టులో పోలీసుల పిటిషన్



**హైదరాబాద్, (ప్రజా మంటలు):** టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్‌రావు వాంగ్మూలంలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. రాధా కిషన్ రావు వాంగ్మూలంలో మాజీ సీఎం కేసీఆర్ పేరును పలుమార్లు ప్రస్తావించినట్టు తెలుస్తోంది. టాస్క్ ఫోర్స్ డీసీపీ నియామకంలో ప్రభాకర్ రావు పాత్ర కీలకమని వెల్లడించినట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసులో తొలిసారి మాజీ సీఎం కేసీఆర్ పేరు వెలుగులోకి వచ్చింది. కేసీఆర్ కుటుంబ సభ్యులు, పార్టీలో సన్నిహితుల వ్యవహారాలను చక్కబెట్టేందుకు తాము పనిచేశామని రాధా కిషన్ రావు వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రణీత్‌రావు వెల్లడించే వివరాల ఆధారంగా రాజకీయ నేతలతో పాటు వారికి ఆర్థికంగా సహాయం చేసే వారిని లొంగదీసుకున్నామని తెలిపారు. సివిల్ తగాదాల్లో సెటిల్మెంట్ చేస్తూ ఎన్నికల సమయంలో వారి నగదును అడ్డుకున్నామని రాధా కిషన్‌రావు తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన నగదు తరలింపులో తాము సహకరించినట్టు టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్ రావు వెల్లడించారు.

మిగతా 2లో..

# పదేళ్లుగా మోడీ చేసిందేమీ లేదు

- కులగణన చేపట్టకుండా చేయడంలో ఆంతర్యమిదే
- పదేళ్లుగా దేశానికి మోడీ చేసిందేమీ లేదు
- విభజన హామీలు తుంగలో తొక్కారు
- బయ్యారం ఉక్కు, కోచ్ ఫ్యాక్టరీ తరలింపు
- 400 సీట్ల వెనక భారీ కుట్ర దాగివుంది
- లక్షల కోట్ల నిధులు గుజరాత్‌కు తరలింపు
- రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్ గెలవాలి
- రాముడి పేరుతో రాజకీయం చేస్తున్న బండి..
- ధర్మపురి,సిరిసిల్ల సభల్లో సీఎం రేవంత్ రెడ్డి



ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వాలను పడగొట్టి భాజపా ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నారు. భాజపాకు ఓటు వేస్తే రిజర్వేషన్ల రద్దుకు ఉపయోగపడుతుంది. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రిజర్వేషన్లు పెంచేందుకు దోహదపడుతుంది‘ అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కెసిఆర్ పైనా విమర్శలు గుప్పించారు. తెలంగాణ సంపదను దోచుకున్నారని అన్నారు. ఆయన, ఈయన కలిసి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కులగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పదేండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణకు బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చిందని విమర్శించారు. పాలకుర్తి లిఫ్ట్, రామగుండంలో 800 యూనిట్ల పవర్ జనరేషన్, నేతకాని కార్మికులకు కార్పోరేషన్, మంచిర్యాలలో మల్టీస్పెషలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని తెలిపారు. వంశీని రెండు లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించండని కోరారు. కార్మికుల కోసం కాకా ఎంతో చేశారని అన్నారు. స్పీకర్ పదవికే శ్రీపాదరావు వన్నె తెచ్చారని గుర్తు చేశారు. విలువలతో కూడుకున్న రాజకీయం చేశారని తెలిపారు. కొప్పుల ఈశ్వర్ కు ఓటు అడిగే నైతక హక్కు లేదని ఆరోపించారు.

**రాముడి పేరుతో రాజకీయం చేస్తున్న బండి..**

**రాజన్న సిరిసిల్ల బ్యూరో:**కరీంనగర్ ఎంపీగా పోటీ చేస్తున్న బిజెపి ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ రాముడు పేరుతో రాజకీయం చేస్తున్నారని పిసిసి అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన జాతర ఎన్నికల బహిరంగ సభను నిర్వహించారు. సభకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ బిజెపి పార్టీలపై మండిపడ్డారు. రాముడి పేరుతో రాజకీయం చేస్తున్న బిజెపి నాయకులు బండి సంజయ్ ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు శుభం కలగాలంటే శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట , పట్టాభిషేకం కళ్యాణం తర్వాత ఇస్తే బాగుండేదని అన్నారు. గత ఎన్నికల్లోను మతాన్ని అడ్డం పెట్టుకొని గెలిచారని మళ్లీ మతాన్ని అడ్డం పెట్టుకొని మోడీ అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటివరకు వినోద్ కుమార్, బండి సంజయ్ ఎంపీలుగా ప్రజలకు ఏం చేశారు చెప్పాలని అన్నారు. గతంలో ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి తిరుపతికి రైలు కరీంనగర్ పాస్ పోర్ట్ కేంద్రం సిరిసిల్ల వేములవాడకు కార్మిక ఆసుపత్రులు వచ్చాయని అన్నారు. సిరిసిల్లకు వచ్చే టెక్స్ టైల్ జోన్ వరంగల్ పోవడానికి బిజెపి నాయకులు బిఆర్ఎస్ నాయకులు కారణం కాదని ప్రశ్నించారు. కేంద్ర పర్యటక శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి నుండి అంజన్న ఆలయానికి ప్రసాద పథకం ద్వారా నయా పైసా తేలేదని మండిపడ్డారు. పదేళ్లలో టిఆర్ఎస్ సిరిసిల్ల ధార్మిక కార్మిక క్షేత్రం లో సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. రాజన్న ఆలయానికి 100 కోట్లు ఇస్తామని టిఆర్ఎస్ నాయకులు ఇవ్వలేదని అన్నారు. ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి పరిష్కరించని బిజెపి, బిఆర్ఎస్ పార్టీలను ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. టిఆర్ఎస్ అప్పర్ మానేరు ప్యాకేజీ 9 ఎందుకు పూర్తి కాలేదని కేటీఆర్ ను ప్రశ్నించారు. టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు మధ్య చీకటి ఒప్పందం ఉందని విభజన హామీలు అమలు చేయని బిజెపిని 10 ఏళ్లలో బిఆర్ఎస్ ప్రశ్నించ లేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ ను గెలిపించాలని కోరారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి, సిపిఐ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. జన జాతర సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్ కొత్త మేనిఫెస్టో



విడుదల చేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని మ్యానిఫెస్టో తయారు చేసినట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఇందులో 23 అంశాలు చేర్చినట్లు చెప్పారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే విభజన చట్టం హామీలు అమలు చేస్తామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువత కోసం వివిధ యూనివర్సిటీలు తెస్తామన్నారు. మేడారం జాతరకు జాతీయ హోదా కల్పిస్తామని చెప్పారు. సుప్రీం కోర్టు ప్రత్యేక బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. ఏపీలో కలిపిన 5 గ్రామాలను మళ్లీ రాష్ట్రంలో విలీనం చేస్తామన్నారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా కల్పిస్తామని తెలిపారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు పెంచుతామని చెప్పారు. పార్టీ నేతలు, కార్యకర్తలు.. ప్రతి గడపకు మ్యానిఫెస్టోను తీసుకెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికల క్రమంలో.. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హామీలు ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు మేనిఫెస్టోలో స్పష్టం చేసింది. ఇందులో హైదరాబాద్ -టూ- బెంగళూరు ఐటీ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ముఖ్యమైనది. రాష్ట్ర అవసరాలు ఆలోచించి మరీ మేనిఫెస్టో తయారుచేశామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, మేడారం జాతరకు జాతీయ హోదా కల్పిస్తామని చెప్పారు. ఈ మేనిఫెస్టోను యువత, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం జరిగేలా రూపొందించి నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అన్నివర్గాలతో మాట్లాడి మేనిఫెస్టో తయారు చేశామని వెల్లడించారు. పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారంటీలో భాగంగా మేనిఫెస్టో తయారు చేసినట్లు మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిందిని.. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటామని వివరించారు. తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో సాంస్కృతిక, వినోద కేంద్రం ఏర్పాటు , మేడారం జాతరకు జాతీయ హోదా, గతంలో ఇచ్చిన హామీ మేరకు ఐటీఐఆర్ ప్రాజెక్టు ప్రారంభం, భద్రాచలం వద్ద ఏపీలో విలీనమైన 5 గ్రామాలను మళ్లీ రాష్ట్రంలో విలీనం వంటి హామీలు ఉన్నాయి. అలాగే 4 సైనిక పాఠశాలలు ఏర్పాటు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు, కేంద్ర నిధులు నేరుగా స్థానిక సంస్థలకు అందేలా చూడటం, సౌరశక్తి ఉత్పత్తి ప్రోత్సాహం ఇస్తామని ప్రకటించారు.విభజన హామీలకు మేనిఫెస్టోలో ప్రాధాన్యత ఇచ్చారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని.. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం జరుపుతామని ప్రకటించారు. రాష్ట్రంలో మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు రామగుండం-మణుగూరు కొత్త రైల్వే లైను ఏర్పాటు, రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు వంటి హామీ?లను ఇచ్చారు. కార్యక్రమంలో మేనిఫెస్టో కమిటీ చైర్మన్, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, అజారుద్దీన్, అంజన్ కుమార్ యాదవ్, చిన్నారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ పాల్గొన్నారు.

# నా బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీల్లో వణుకు

నా గొంతను నొక్కేశారు. ఈ రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇవ్వడం లేదని, గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల బిల్లులు చెల్లించడం లేదని, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తే.. మీరు మొన్నటిదాకా దొబ్బితన్నది చాలాదా..? అని కాంగ్రెస్ నాయకుడు మాట్లాడిండు. నిరోధ్‌లు, పాపడాలు అమ్ముకోండి అని ఆ కాంగ్రెస్ నేత మాట్లాడారు. చేనేత కార్మికులంటే అలకగా కనబడుతున్నారా..? అని కోపంలో ఒక మాట మాట్లాడాను. రూ. 370 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని అడిగితే నిరోధ్‌లు అమ్ముకోండి అంటే కోపంతో ఒక మాట అన్నాను అని కేసీఆర్ తెలిపారు. నేను బస్సు యాత్ర చేపట్టిన తర్వాత కాంగ్రెస్, బీజేపీకి గుండెలు వణుకుతున్నాయి.ఇద్దరు కుమ్మక్కై నిలువరించాలని కుట్ర చేశారు.. ప్రచారంపై బ్యాన్ పెట్టారు. నేను ఇక్కడికి 2 గంటల ముందే ఉంచాను. బ్యాన్ ఉన్నందుకు 8.15 తర్వాత బయటకు వచ్చాను. రాజకీయాల్లో మతం గురించి మాట్లాడటం ఎన్నికల నిబంధనలకు విరుద్ధం. కానీ అమిత్ షా తన చేతిలో దేవుడి బొమ్మ పెట్టుకుని మాట్లాడుతుంటే ఈసీకి కనిపించదు. ప్రధాని మోదీ హిందూవులు ముస్లింలు అని మాట్లాడితే ఈసీకి కనిపించదు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ఏం చేశావని అడిగితే గుడ్లు పీకి గోలీలు ఆడుతాం, పండవెట్టి తొక్కుతాం అని మాట్లాడితే ఈసీకి కనబడదు. చేనేత కార్మికుల పక్షాన మాట్లాడితే ఈ రకంగా బ్యాన్ చేశారు. ఎన్నికల్లో ఏ పార్టీ గెలవాలనేది ప్రజలే నిర్ణయిస్తారు అని కేసీఆర్ పేర్కొన్నారు.

# స్కాముల్లో యూపిఎను మించిన మమతా బెనర్జీ

## రికార్డు సృష్టించిందని విమర్శించిన ప్రధాని మోడీ

2జీ స్పెక్ట్రమ్ స్కామ్, కామన్వెల్త్ గేమ్స్ స్కామ్, చివరకు రక్షణ రంగంలో సైతం స్కామ్ జరిగిందని గుర్తు చేశారు. నాటి యూపీఏ ప్రభుత్వ బాటలోనే ఈ మమతా బెనర్జి పయనిస్తుందని ఆరోపించారు. ఇక తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతల నివాసాలపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు జరిపిన దాడుల్లో కోట్లాది రూపాయిల నగదు పట్టుబడిన విషయాన్ని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు.అయితే ఈ స్కామ్‌లపై విచారణ జరపాలని కోల్‌కతా హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. అయితే అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రం.. కేంద్రం దర్యాప్తు సంస్థ అధికారులపై ఆరోపణలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి అత్యధిక స్థానాల్లో గెలిపించాలని ప్రజలకు ఈ సందర్భంగా మోదీ విజ్ఞప్తి చేశారు. అయితే ఇండియా కుటమిలోని పార్టీల్లోని నేతలకు దూర దృష్టి లేదని విమర్శించారు. మూడు దశాబ్దాల్లో గత ప్రభుత్వాలు కొత్త విద్య విధానాన్నే ప్రవేశ పెట్టలేదని చెప్పారు. కానీ తమ 10 ఏళ్ల పాలనలో దేశంలో అధునిక విద్యా విధానాన్ని ప్రవేశపెట్టామని ప్రధాని మోదీ గుర్తు చేశారు. శుక్రవారం బిర్భం జిల్లాలోని అమోద్ పూర్‌లో బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు దేబంత్ భట్టాచార్య, ప్రియా షాకు మద్దతుగా మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

# ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

## జూలై చివరి వారానికి వాయిదా వేసిన సుప్రీం

జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ కేసు విచారణ తెలంగాణలో కాకుండా మధ్యప్రదేశ్‌లో జరిగేలా బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు గుంతకండ్ల జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మహ్మద్ అలీ, కల్వకుంట్ల సంజయ్‌లు ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. గత విచారణ సందర్భంగా ప్రతివాదులుగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆ సమయంలో ఆదేశించింది. కాగా, విచారణ సందర్భంగా దేశంలో ఇన్ని రాష్ట్రాలు ఉండగా మధ్యప్రదేశ్ కు మాత్రమే ఎందుకు మార్చాలని పిటిషనర్ల తరుపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది.

## వీడియో కాన్ఫరెన్స్ వద్దు ,నేరుగా విచారణకు హాజరవుతా : కవిత

మాట్లాడారు. ఈ చర్యపై ట్రయల్ కోర్టు జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తదుపరి విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు అధికారులు. కానీ, ఈసారి అలా చేయబోనని.. తనను నేరుగా కోర్టుకు హాజరుపరచాలని కోర్టును కోరారు ఎమ్మెల్సీ కవిత. మరి దీనిపై న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే తెలియాలి.

### మిత్ షా వీడియో మార్ఫింగ్ కేసు

అరెస్ట్ అయిన ఐదుగురిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రాత్రంతా విచారించారు. ఫేక్ వీడియో కి సంబంధించిన కంప్యూటర్లు, హార్డిస్కులు, పెన్ డ్రైవ్‌ను హైదరాబాద్ పోలీసులు సీజ్ చేశారు.

# కేసీఆర్ ఆదేశాల మేరకే చేశాం

2017 లో ఎస్పీగా ప్రమోషన్ వచ్చిన తర్వాత టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించడంలో ప్రభాకర్ రావు పాత్ర కీలకమని తెలిపారు. ÷ఖఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలు చక్కదిద్దేందుకే తనను ఏరీ కోరి టాస్క్ ఫోర్స్ డీసీపీగా నియమించి నట్టు వెల్లడించారు. టాస్క్ ఫోర్స్ డీసీపీగా నియామకం తర్వాత కేసీఆర్ అత్యంత సన్నిహితుల కార్యకలాపాలను చెక్కబెట్టేవాడినని రాధా కిషన్ రావు తెలిపారు. అధికార పార్టీ నగదు రవాణాకు ప్రణీత్ రావుతో సమన్వయం చేసుకోవాలని ప్రభాకర్ రావు ఆదేశాలు



ఇచ్చేవాడని వెల్లడించారు. కేసీఆర్‌కు లబ్ది చేకూరేలా ప్రభాకర్ రావు ప్రత్యేక పనులు తనకు అప్పగించే వాడన్నారు. అడిషనల్ ఎస్పీ భుజంగరావు ప్రతి విషయాన్ని ప్రగతిభవన్‌లో కేసీఆర్‌కు స్వయంగా వెళ్లి సమాచారం ఇచ్చేవాడని రాధా కిషన్ రావు వెల్లడించినట్టు తెలుస్తోంది.

ప్రభాకర్ రావు అరెస్ట్‌కు అనుమతివ్వండి

ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విదేశాల్లో ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును అరెస్టు చేయడానికి అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఆర్పీసీ 73 ద్వారా అరెస్ట్ వారెంట్ జారీ చేయాలని కోరారు. ప్రస్తుతం ప్రభాకర్‌రావు అమెరికాలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు నలుగురు పోలీసు అధికారులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. పోలీసు కస్టడీలో వారు చెప్పిన వివరాల ఆధారంగా ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్‌లో కీలకంగా వ్యవహరించారని దర్యాప్తు బృందం గుర్తించింది. కేసు నమోదైన వెంటనే ఆయన విదేశాలకు వెళ్లిపోయారు. ఎక్కడ ఎయిర్ పోర్టులో దిగినా పట్టుకునేందుకు వీలుగా ఇప్పటికే పోలీసులు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. రెడ్ కార్నర్ నోటీసు, ఇంటర్‌పోల్ అధికారులను దర్యాప్తు బృదం సంప్రదించాలంటే కోర్టు అనుమతించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో సీఆర్పీసీ 73 ద్వారా అరెస్టు వారెంట్ జారీ చేయాలని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు.

# సీట్లిస్తే రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారు

**- సికింద్రాబాద్ రోడ్ షోలో కేటీఆర్**




**హైదరాబాద్ (ప్రజా మంటలు):** గత శాసనసభ ఎన్నికలో కాంగ్రెస్ , బీజేపీ ఎన్ని మాయమాటలు చెప్పిన గ్రేటర్ ప్రజలు కేసీఆర్‌నే కావాలని అన్నారని కేటీఆర్ తెలిపారు. 2014లో బడా భాయ్ మస్తు కథలు చెప్పారని, మళ్లీ 2023లో చోటా భాయ్ మహిళలకు స్కూటీల పేరుతో ఇంకో దగాకు సిద్ధపడ్డారని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో జరిగిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు.లోక్‌సభ ఎన్నికల్లో 10 నుంచి 12 సీట్లు ఇవ్వండి ఏడాదిలోపు కేసీఆర్? రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని బీఆర్?ఎస్? కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్ బీజేపీ ఏం చెప్పినా వినలేదని కేవలం కేసీఆర్?నే కావాలని అన్నారని తెలిపారు. సికింద్రాబాద్? పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని అడ్డగుట్టలో జరిగిన రోడ్‌షో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. 2014లో బడా భాయ్ మస్తు కథలు చెప్పారని జన్‌దన్‌ఖాతా తెరవండి రూ.15 లక్షలు ఖాతాల్లో వేస్తామని అన్నారని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామని, నీళ్లు ఇస్తామని, బుల్లెట్ రైలు పరుగులు పెట్టిస్తానని, నల్లధనం వాపస్? తెస్తానని అన్నారని కానీ ఏం చేయలేదని ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఐదేళ్లలో కుర్‌కురేలు పంచారని ఒక్క పని చేయలేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో వరదలు వస్తే రూపాయి కూడా సాయం చేయలేదు కానీ గుజరాత్‌లో వస్తే మాత్రం హెలికాప్టర్?లో వెళ్లి నిధులు ఇచ్చారని తెలిపారు. మరి అక్కరకు రాని కిషన్ రెడ్డి అవసరం లేదని పేర్కొన్నారు. స్కూటీ లేదు కాంగ్రెస్‌లూటీనే : ప్రధానిగా మోదీ వచ్చిన తర్వాత రూ.400 ఉన్న సిలిండర్ ధర ఇప్పుడు రూ.1200లకు చేరిందని కేటీఆర్? చెప్పారు. అలాగే పెట్రోల్, డీజిల్? ధరలను బీజేపీనే పెంచేసిందన్నారు. తాను చెప్పేది తప్పు అయితే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. అన్ని పెంచీ రూ.30 లక్షల కోట్లు వసూలు చేశారని, అందులో నుంచి రూ.14 లక్షల కోట్లను అంబానీ, అదానీలకు రుణమాఫీ చేశారని ఆరోపించారు. పేదలను కొట్టి పెద్దలకు ఆ డబ్బును పంచారన్నారు. ఇప్పుడు చోటా భాయ్ రేవంత్ రెడ్డి నెలకు రూ.2,500, స్కూటీ అన్నారని, కానీ స్కూటీ లేదు కాంగ్రెస్‌లూటీ మొదలైందని కేటీఆర్ దుయ్యబట్టారు. “లోక్‌సభ ఎన్నికల్లో 10 నుంచి 12 సీట్లు ఇవ్వండి. ఏడాదిలోపు కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్నారు. కానీ గ్రేటర్? ప్రజలు కాంగ్రెస్?, బీజేపీ ఏం చెప్పినా వినలేదు. 2014లో బడా భాయ్? మస్తు కథలు చెప్పారు. ఇప్పుడు 2023లో చోటా భాయ్? స్కూటీ ఇస్తామన్నారు లేదు. కానీ స్కూటీ పేరుతో కాంగ్రెస్? లూటీ మాత్రం చేసింది.”



ఎండపల్లి మండలం రాజారాంపల్లి బహిరంగ సభలో ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి...

# రాయబరేలీ నుంచి రాహుల్ నామినేషన్

**- అమేథీ నుంచి కిశోరీ లాల్ శర్మ..**

**- హాజరైన సోనియా, ప్రియాంక, మల్లికార్జున ఖర్గే, తెలంగణ సీఎం రేవంత్**



లక్నో (ప్రజా మంటలు): రాయబరేలి, అమేథీ అభ్యర్థులను ప్రకటించడం ఆలస్యం..ఆ ఇద్దరు అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు వేశారు. రాయబరేలిలో రాహుల్ నామినేసన్ వేయగా అగ్రనేతలు తరలివచ్చారు. తల్లి సోనియా వెంటరాగా రాహుల్ నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని రాయ్ బరేలీ నుంచి ఎంపీగా ఎంపిక చేయగా నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. రాహుల్ వెంట సోనియా గాంధీ, సోదరి ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాబర్ట్ వాద్రా ఉన్నారు. సోనియా గాంధీ రాజ్యసభకు ఎంపిక కావడంతో రాయ్ బరేలీ నుంచి ఈ సారి రాహుల్ పోటీ చేస్తున్నారు. రాయ్‌బరేలీ నుంచి దినేష్ ప్రతాప్ సింగ్‌ను బీజేపీ పోటీకి దింపింది. అయితే ఇక్కడ ప్రియాంక పోటీ చేస్తారని అంతా భావించారు. కానీ ఆమె ఎందుకనో దూరంగా ఉన్నారు. మరోవైపు అమెథీ నుంచి కిశోరీ లాల్ శర్మ నామినేషన్ వేశారు. ఈ రెండు స్థానాలకు మే 20న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లకు శుక్రవారం చివరితేదీ కావడంతో రాహుల్ నామినేషన్ వేశారు. వయోనాడ్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న రాహుల్ మరోసారి అక్కడి నుంచే పోటీచేశారు. ఏప్రిల్ 26న అక్కడ పోలింగ్ పూర్తయ్యింది. ఇకపోతే చాలకాలం తరవాత గాంధీయేతరులకు అమేథీలో టిక్కెట్ ఇచ్చారు. అమేరీ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కిషోరీ లాల్ శర్మ నామినేషన్ వేశారు. శుక్రవారం అమేరీ రిటర్నింగ్ అధికారికి ఆయన తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. అయితే అమేరీ, రాయ్ బరేలీ నుంచి రాహుల్, ప్రియాంక గాంధీలు బరిలో దిగుతారంటూ నిన్న మొన్నటి వరకు ఊహాగానాలు ఊపందుకొన్నాయి. ఇంకా చెప్పాలంటే.. గాంధీ కుటుంబానికి ఈ రెండు లోక్‌సభ స్థానాలు కంచుకోటలన్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ రెండు స్థానాల నుంచి వీరిద్దరు బరిలో దిగుతున్నారంటూ... అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో ఓ ప్రచారం జోరుగా సాగింది. ఈక్రమంలో అమేరీ, రాయ్‌బరేలీ 'అభ్యర్థుల' ఎంపికపై పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే కసరత్తు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేష్ బుధవారం ప్రకటించారు. ఆ యా స్థానాలకు అభ్యర్థుల ఎంపిక 24 లేదా 30 గంటల్లో తేలుతుందని ఈ సంధ్భంగా ఆయన స్పష్టం చేశారు. దీంతో గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న కిషోరీ లాల్ శర్మను అమేరీ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. మరోవైపు రాయ్‌బరేలీ ఎంపీ అభ్యర్థిగా రాహుల్ గాంధీ పోటీ చేయనున్నారని ప్రకటించింది. ఇక కేరళలోని వాయనాడ్ ఎంపీ అభ్యర్థిగా రాహుల్ పోటీకి దిగారు. లోక్‌సభ స్థానానికి ఇప్పటికే ఎన్నికలు జరిగాయి. అయితే అమేరీ ఎంపీ అభ్యర్థిగా గాంధీ కుటుంబంలోని వ్యక్తిని కాకుండా బయట వ్యక్తిని బరిలో దింపడంతో కాంగ్రెస్ పార్టీపై బీజేపీ అగ్రనేతలు వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. అమేరీ నుంచి బరిలో దిగితే ఓటమి తప్పదనే విషయం గాంధీ కుటుంబానికి అర్థమైందని అంటున్నారు.అందుకే వారు మరో స్థానాన్ని ఎంచుకున్నారని బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ క్రమంలో గాంధీ కుటుంబంలోని వారిని కాకుండా బయట వ్యక్తిని బరిలో దింపడంతో.. ఎన్నికల ముందే ఓటమి తథ్యమని గాంధీ కుటుంబం అర్థమైందని బీజేపీ నేతలు ఆరోపణలు సంధిస్తున్నారు. ఇక అమేరీ నుంచి బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ బరిలో దిగారు. గత ఎన్నికల్లో అంటే.. 2019లో ఇదే స్థానం నుంచి బరిలో దిగిన రాహుల్ గాంధీ... స్మృతీ ఇరానీ చేతిలో ఓటమి పాలైన సంగతి తెలిసిందే.



# కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ పరిశీలిస్తాం

**- ఎలాంటి షరతులు కావాలో చెప్పండి**

**- ఈడీని ఆదేశించిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ (ప్రజా మంటలు): ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కు ఒకవేళ తాత్కాలిక బెయిల్ ఇవ్వాలనుకుంటే ఎలాంటి కండిషన్స్ పెట్టాలో తయారు చేయమని ఈడిని శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ విషయాన్ని మే 7న చేపట్టనున్నట్లు కూడా తెలిపింది. మేము బెయిల్ ఇస్తామో లేదో కానీ ఏ పక్షానికి ఆశ్చర్యకరంగా ఉండకుండా చూడాలన్నదే మా ఉద్దేశ్యం అని న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తా తో కూడిన ధర్మాసనం తెలిపింది. అంతేకాక బెయిల్ మంజూరు చేస్తామని ఇరు వర్గాలు ముందుగానే అభిప్రాయానికి రాకూడదని కూడా చెప్పింది. దేశ రాజధానిలో ఎన్నికల నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ అంశంపై వాదనలు వింటామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇందుకు సంబంధించిన పిటిషన్‌ను మే 7న విచారిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కు తెలిపింది. ఈక్రమంలో విచారణకు సిద్ధమై రావాలని ఈడీ తరపు న్యాయవాదికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. 'ఈడీ అరెస్టుకు వ్యతిరేకంగా కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు సమయం పట్టే అవకాశం ఉంది. అందుకే ఆయన మధ్యంతర బెయిల్ పిటిషన్ విచారణను పరిశీలిస్తాం' అని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. దీనిపై స్పందిస్తూ.. మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తాము వ్యతిరేకిస్తామని ఈడీ తరపున అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు పేర్కొన్నారు. దాంతో మరింత స్పష్టతనిచ్చిన ధర్మాసనం.. 'కేవలం పిటిషన్‌ను మాత్రమే విచారిస్తాం, బెయిల్ ఇస్తామని చెప్పడం లేదు. చివరకు బెయిల్ ఇవ్వొచ్చు, ఇవ్వకపోవచ్చు' అని తెలిపింది. ఇందుకు సంబంధించి వాదనల కోసం సిద్ధమై రావాలని ఈడీకి సుప్రీం ధర్మాసనం సూచించింది. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మార్చి 21న అరెస్టు అయిన దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్.. ప్రస్తుతం తిహాడ్ జైల్లో ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ కోసం ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందన తెలియజేయాలని ఏప్రిల్ 15న ఈడీకి నోటీసులు జారీ చేసింది.




# పాకిస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



**- అదుపుతప్పి లోయలో పడిన బస్సు**

**- 20 మంది దుర్మరణం**

పెషావర్ (ప్రజా మంటలు): పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం చోటుచేసుకుంది. కారకోరమ్ హైవేపై బస్సు అదుపుతప్పి లోయలో పడిన ఘటనలో 20 మంది దుర్మరణం పొందినట్లు పోలీసులు వెల్లడించారు.రావల్పిండి నుంచి గిల్గిత్ కు వెళ్తున్న బస్సు.. గిల్గిత్– బాల్టిస్థాన్‌లోని దయామర్ జిల్లాలో శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పర్వత ప్రాంతంలో ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతోనే ఈ బస్సు అదుపు తప్పిందన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 43 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిపారు. సైనిక హెలికాప్టర్లతో సహాయక చర్యలు చేపట్టిన అధికారులు.. క్షతగాత్రులను చిలాస్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గాయపడినవారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఘటన జరిగిన విషయం తెలియగానే.. స్థానిక ఉలేమా అక్కడి మసీదు వద్ద లౌడ్‌స్పీకర్‌లో క్షతగాత్రులకు రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్, గిల్గిత్– బాల్టిస్థాన్ ముఖ్యమంత్రి హాజీ గుల్బార్ ఖాన్ విచారం వ్యక్తంచేశారు.

# బీఆర్ఎస్‌కు మరో ఎదురుదెబ్బ

**- ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక రద్దు**

**- ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు**

**- రూ.50వేల జరిమానా కూడా విధింపు**



హైదరాబాద్ (ప్రజా మంటలు): భారత రాష్ట్ర సమితికి వరుసగా కష్టాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఎమ్మెల్సీ దండె విఠల్ పై అనర్హతా వేటు పడింది. భారాస ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నికపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఎమ్మెల్సీగా ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించింది. కాంగ్రెస్ నేత పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపి విఠల్ ఎన్నికను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆయనకు రూ.50 వేల జరిమానా విధించింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి భారాస ఎమ్మెల్సీగా 2022లో దండె విఠల్ ఎన్నికయ్యారు. అయితే, తాను నామినేషన్ ఉపసంహరించుకోలేదని, తన సంతకాలు ఫోర్జరీ చేశారని పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించారు. విఠల్ ఎన్నిక చెల్లదంటూ ప్రకటించాలని కోర్టును కోరారు. ఫోర్జరీని తేల్చేందుకు పత్రాలను కేంద్ర ఫోరెన్సిక్ లేబొరేటరికీ పంపించాలని కోరారు. అనంతరం దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. విఠల్ ఎన్నికను రద్దు చేస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించింది.ఆదిలాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి దండె విఠల్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక చెల్లదని కాంగ్రెస్ నేత పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న హైకోర్టు దండె విఠల్ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది. 2021లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక జరిగింది. అప్పుడు బీఆర్ఎస్ అధికారిక అభ్యర్థిగా కేసీఆర్ దండె విఠల్ ను ఖరారు చేశారు. ఈ పేరుతో విబేధించిన అప్పటి బీఆర్ఎస్ నేత పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఇండిపెండెంట్ గా నామినేషన్ దాఖలు చేశారు. అయితే నామనేషన్ల ఉపసంహరణ సమయంలో ఆయన పేరుతో ఉపసంహరణ దరఖాస్తు వచ్చిందని చెప్పి.. ఆయన నామినేషన్ పత్రాలను ఉపసంహరించేశారు రిటర్నింగ్ అధికారి. కానీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి తాను నామినేషన్ ఉపసంహరించుకోలేదని తన సంతకం ఫోర్జరీ చేసి.. ఉపసంహరించినట్లుగా ప్రకటించారని కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘంగా విచారణ జరిపిన న్యాయస్థానం .. నామినేషన్ ఉపసంహరణ పత్రాలపై సంతకం పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డిది కాదని తేల్చి.. ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో దండె విఠల్ ఏకపక్ష విజయం సాధించారు. ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీ చేసి 667 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.మొత్తం ఓట్లలో దండే విఠల్ 742 ఓట్లశాతం తెచ్చుకున్నారు. ఆదిలాబాద్ లో మొత్తం ఓట్లు 860. అందులో చెల్లిన ఓట్లు 810, చెల్లని ఓట్లు 45 ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థి పెందూరి పుష్పరాణి 75 ఓట్లకే పరిమితమయ్యారు. పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి నామినేషన్ ఉపసంహరణతో అసలు వివాదం ప్రారంభమయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన గెలిచిన ఇద్దరు ఎమ్మెల్సీలు రాజీనామాలు చేయడంతో వారి స్థానంలో ఎన్నికలు జరుగుతున్నాయి. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఇప్పటికే పూర్తయింది. కోడ్ కారణగా కౌంటింగ్ వాయిదా పడింది. వరంగల్, నల్లగొండష ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి నోటిఫికేషన్ వచ్చింది. రెండో తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. కాంగ్రెస్ తరపున తీన్మార్ మల్లన్న పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదు.

# వృద్ధుల ప్రాణాలతో చెలగాటం

## పెన్షన్ కారణంగా ఇంకెంత మంది బలి

**నెకోరకంగా వీధుల్లోకి ఈడ్చి చంపుతారా - మరోమారు ఘాటుగా విమర్శలు చేసిన షర్మిల**

కడప,మే3 (ప్రజా మంటలు): రాష్ట్రంలో పింఛన్‌ల పేరుతో వృద్ధుల ప్రాణాలతో జగన్ ప్రభుత్వం చెలగాట మాటమాడుతోందని ఏపీపీసీ ఛీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. వృద్ధులను ఒక్కో నెల ఒక్కోరకంగా వీధుల్లోకీడ్చి పొట్టన పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. వృద్ధుల ఉసురు కొట్టుకోవద్దని సీఎస్‌కు సూచిస్తున్నానన్నారు. వైసీపీ నవరత్నాలు నవ సందేహాలుగా మారాయని.. ఉద్యోగులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావని తెలిపారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఉద్యోగులకు ఫ్రీడమ్ ఇవ్వడంతో పాటు కలుపుకుపోయే వారని గుర్తుచేశారు. మరి అయన బిడ్డ జగన్ చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. బహిరంగంగా బొత్స లాంటి వారు బెదిరించడం ఏంటి అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని.. వారి గొంతు నొక్కడం సరికాదన్నారు. ఓపీఎస్ కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. ఏ విషయం తీసుకున్నా ఇవ్వడం లేదని.. ఉద్యోగులను అన్ని విధాలాఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఉద్యోగుల హెచ్‌ఆర్‌లోను కోత పెట్టారని విమర్శించారు. 12వ పీఆర్‌సీ కూడా అమలు చేయకుండా కోత పెట్టారన్నారు. ఉద్యోగులను అన్నివిధాలా జగన్ మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓపీఎస్‌ను అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. మేనిపెస్టోకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. రాష్టంలో 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. వైసీపీ పార్టీకి మేలు చేయాలని ఇంత ఘోరంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటూ పార్టీకి అనుకూలంగా పని చెయ్యడం సీఎస్‌కు తగదంటూ వ్యాఖ్యలు చేశారు. ఐఏఎస్ అధికారులను తమకు అనుకూలంగా వాడుకోవడం సరికాదని షర్మిల పేర్కొన్నారు.

# ఏపిలో మోడీ ప్రచార షెడ్యూల్ ఖరారు

**రాష్ట్రంలో రెండ్రోజుల పాటు ప్రచారం - బాబు, పవన్ కళ్యాణ్‌లతో కలసి ఎన్నికల ర్యాలీలు**

అమరావతి,మే3 (ప్రజా మంటలు): ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచార షెడ్యూల్ ఖరారైంది. ప్రధాని రెండు రోజుల పాటు రాష్ట్రంలో ప్రచారం చేయనున్నారు. ఈనెల 6, 8 తేదీలలో ప్రధాని మోదీ, టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు , పవన్ కళ్యాణ్‌ల ఉమ్మడి ప్రచార సభలు నిర్వహించ నున్నారు. ఈనెల 6వ తేదీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు మధ్యాహ్నం మూడు గంటలకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి వేమగిరి చేరుకుని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌తో కలిసి ఎన్నికల సభలో పాల్గొంటారు. 6వ తేదీ సాయంత్రం 5 గంటల 45 నిమిషాలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ప్రధాని వెళ్లనున్నారు. సాయంత్రం 5 :55 గంటలకు అనకాపల్లి చేరుకొని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు మద్దతుగా మోదీ ప్రచారం చేస్తారు. ఈ సభలో మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ప్రసంగించనున్నారు. అలాగే ఈనెల 8వ తేదీన బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతికి మోదీ చేరుకుంటారు. పీలేరు అసెంబ్లీ పరిధిలో కలికిరి సభ ప్రాంగణం వద్దకు మధ్యాహ్నం 3 గంటలకు రానున్న ప్రధాని.. రాజంపేట బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి, ఇతర అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. మోదీ సభలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు సభలో పాల్గొననున్నారు. 8న సాయంత్రం 4 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్లనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్దకు మోదీ రానున్నారు. ఇందిర గాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు ఎన్డీఏ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు రోడ్ షోలో పాల్గొననున్నారు.

# లోక్‌సభ ఎన్నికల వేళ మాపై కుట్రలు

**- ఫోన్‌ట్యాపింగ్ పేరుతో అసత్యప్రచారాలు**

**- అడ్డుకోవాలంటూ హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్**

హైదరాబాద్ (ప్రజా మంటలు): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మాజీ సీఎం కేసీఆర్ కోసమే ఫోన్ ట్యాపింగ్ చేశామంటూ మాజీ పోలీసు అధికారి రాధాకిషన్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం నేపథ్యంలో శుక్రవారం ఆసక్తికర పరిణామం జరిగింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేసింది. ఇప్పటికే ఎలక్షన్ కమిషన్‌కు ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ పేర్కొంది. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ నేతలపై ప్రచారం చేస్తున్న నేతలపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. పలు సందర్భాల్లో బీఆర్ఎస్ నాయకులపై చేసిన ఆరోపణలను పిటిషనర్ కోర్టుకు సమర్పించారు. తమ ఫిర్యాదుపై ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరారు. శుక్రవారం ఈ ఫిర్యాదుపై స్పందిస్తామని ఎలక్షన్ కమిషన్ కోర్టుకు తెలిపింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రణీత్‌కుమార్ అందించే వివరాలతో.. కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థులను, వారికి ఆర్థిక సాయం అందించేవారిని బెదిరించి లొంగదీసుకునేవారమని, సివిల్ తగాదాల్లో సెటిల్మెంట్లు చేసేవారమని, ఎన్నికల్లో వారి నగదు తరలింపును అడ్డుకునేవారమని చెప్పారు. బీఆర్ఎస్ డబ్బు రవాణాకు సహకరించేవారమని తెలిపారు. గత నెల 3 నుంచి 10వ తేదీ వరకు దర్యాప్తు అధికారులు రాధాకిషన్‌ను కస్టడీలోకి తీసుకుని, విచారించిన విషయం తెలిసిందే..! ఆ క్రమంలో గత నెల 9వ తేదీన సేకరించిన వాంగ్మూలంలో.. రాధాకిషన్ పలుమార్లు అప్పటి సీఎం కేసీఆర్ పేరును ప్రస్తావించారు. పెద్దాయన(కేసీఆర్)కు చిన్న విమర్శ ఎదురైనా చిరాకు పడేవారు. అందుకే.. ఎక్కడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళనలు జరగకుండా అణచివేసేవాళ్లం అని వాంగ్మూలంలో రాధాకిషన్ పేర్కొన్నారు.

# చైనా మరో వినూత్న ప్రయోగం

**- చంద్ర శిలల సేకరణకు బయల్దేరిన చైనా చాంగే-6 రాకెట్**



బీజింగ్ (ప్రజా మంటలు): చంద్రుడి అవతలిభాగంలోని నమూనాలను సేకరించేందుకు చైనా ప్రయత్నాలు మొదలుపెట్టింది. దీనిలోభాగంగా నేడు చాంగే-6 మిషన్‌ను ప్రయోగించింది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే జాబిల్లి ఆవలి భాగంలో శిలలు, మట్టిని సేకరించిన తొలి దేశంగా నిలవనుంది. డ్రాగన్ చేపట్టిన లూనార్ ఎక్స్‌ప్లోరేషన్ కార్యక్రమంలో భాగంగా దీనిని చేపట్టారు. వెన్‌ఛెంగ్ శాటిలైట్ లాంచింగ్ సెంటర్ నుంచి లాంగ్‌మార్చ్-5 రాకెట్ ద్వారా దీనిని ప్రయోగించారు. చాంగే-6 చంద్రుడి దక్షిణ ధ్రువంలో ల్యాండ్ అవుతుంది. ఇక్కడ చాలాకాలంగా సూర్యకాంతి లేకపోవడంతో చంద్రుడిపై పరిస్థితులను తెలిపే చాలా ఆధారాలు లభించవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రయోగంలో భాగంగా ఫ్రాన్స్, ఇటలీ, స్వీడన్, పాకిస్థాన్‌కు చెందిన సైంటిఫిక్ పరికరాలు కూడా దీనిలో ఉన్నాయి. చంద్రుడిపై 2 మీటర్ల లోతున్న 2 కేజీల మెటీరియల్‌ను సేకరించి ఇది భూమికి తీసుకురానుంది. అనంతరం వీటిని చైనా శాస్త్రవేత్తలు విశ్లేషించనున్నారు. దీనిలో పలు అత్యాధునిక టెక్నాలజీలను వాడినట్లు బీజింగ్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చంద్రుడిపై రెట్రోగ్రేడ్ ఆర్బిట్ కంట్రోల్ టెక్నాలజీ, ఇంటెలిజెంట్ శాంపిలింగ్, ఆటోమేటిక్ శాంపిల్ రిటర్న్ వంటివి ఉన్నట్లు చైనాకు చెందిన లూనార్ ఎక్స్‌ప్లోరేషన్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ వెల్లడించారు. 2019లో విజయం సాధించిన చాంగే-4 మిషన్ ఆధారంగా దీనిని నిర్మించారు. ఆ ప్రాజెక్టులో చైనా గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్‌ను పంపింది. ఇది అక్కడి ఉపరితలం అడుగున 10 మీటర్ల వరకు ఎలాఉందనే అంశాలను పరిశీలించింది. అనంతరం చాంగే-6కు రూపకల్పన చేసింది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే జాబిల్లిపై ఖనిజాలకు సంబంధించిన కీలక వివరాలు ఆ దేశానికి తెలియనున్నాయి.



# ఎండలు ఎండలు

కొండంత ఎండ
భువి నిప్పుల వాన
రోడ్లంత ఖాళీ

గోలి సోడాలు
లస్సీ దహీవడాలు
తాప పానీయాలు

కొట్టే ఎండకు
మండిమాడేజనాలు
చావు నీడలు
పక్షి దప్పిక

తీర్చనీ చెరువులు
రాలిన రెక్కలు
కాలం కథలు
అల్లిక జిగిబిగి
కాదులే భారం

రేడియమ్‌జి
9291527757




## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజింగ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

# "నిజాయితీ"

అనగనగా ఒక రాజ్యం ఆ రాజ్యానికి ఒక రాజు ఉన్నాడు. అతనికి ఒక అంతుచిక్కని వ్యాధి ఉంటుంది .ఇక తాను ఎక్కువ రోజులు బతకనని రాజు గారు అనుకొని అందుకు తన రాజ్యానికి ముందుగానే ఒక నిజాయితీ గల యువ రాజుని ఎన్నుకోవాలి అనుకున్నాడు.

మరునాడే రాజ్యంలోని యువకులందరినీ పిలిపించి ఈ విషయం చెప్పాడు. అందరికీ తలా ఒక విత్తనం ఇచ్చి, పది రోజుల తర్వాత మొక్కను పెంచి తీసుకొని తీసుకొని రమ్మన్నాడు. ఎవరి మొక్క అయితే పెద్దగా, బలిష్టంగా ఉంటుందో వాళ్లే ఈ రాజ్యానికి రాజు అని చెప్పాడు. అందరూ ఆ విత్తనాన్ని ఇంటికి తీసుకువెళ్లి కుండీలలో నాటారు.

పది రోజుల తర్వాత అందరూ ఆ విత్తనం నాటిన కుండీలని తీసుకొని వచ్చారు. కానీ మహేంద్ర అనే ఒక యువకుడు మాత్రం ఖాళీ కుండీని తీసుకొచ్చాడు. అప్పుడు రాజు అందరి కుండీలను పరిశీలించి ఆ ఖాళీ కుండీ ని తీసుకువచ్చిన మహేంద్ర అనే యువకుడిని ఈ రాజ్యానికి రాజు అని ప్రకటించాడు. దీంతో అందరు యువకులు విస్తుబోయి చూశారు.

అంతలో ఒక యువకుడు ఓ మహా రాజా! మేము నాటిన విత్తనాలు మొక్కలుగా మారాయి కానీ, ఆ మహేంద్ర నాటిన విత్తనం కనీసం మొలకెత్తనేలేదు. మీరు అతనిని ఈ రాజ్యానికి రాజును ఎలా చేస్తారనీ అడిగాడు.

అప్పుడు రాజు"నేను మీకు ఉడకబెట్టిన విత్తనాలు ఇచ్చాను అలాంటప్పుడు మీకు ఇచ్చిన విత్తనం నుండి మొక్క ఎలా వచ్చింది" అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకి ఎవరు జవాబు ఇవ్వలేదు. తాము చేసిన పనికి సిగ్గుతో తలవంచుకున్నారు. అప్పటినుండి ఆ రాజ్యానికి మహేంద్ర నే రాజుగా ఉన్నాడు. ఆ రాజ్యానికి ఎలాంటి లోటు లేకుండా నిజాయితీతో పరిపాలించ సాగాడు...

రాజ్యానికి రాజు కావడానికి యువకులు అందరూ వేరే విత్తనాలు నాటారు కానీ మహేంద్ర రాజు ఇచ్చిన విత్తనాన్నే నాటి నిజాయితీతో రాజు అయ్యాడు..



**నీతి: నిజాయితీతో ఉంటేనే విజయం సాధిస్తారు అత్యాశపడితే విజయం సాధించలేరు.**

పుల్లగూర్ల శీర్షిక,
9వ తరగతి,
ఘనపురం, తొగుట మండలం,
సిద్దిపేట జిల్లా.

# ఎన్నికల వేళ..మద్యం అమ్మకాల జోరు !

ఎన్నికల వేళ మద్యం అమ్మకాలు పెరిగాయి. ఫలనా పార్టీ అన్న తేడా లేకుండా అన్ని పార్టీలు మద్యం డంపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. కార్యకర్తలు కూడా మందులేనిదే అడుగు బయటపెట్టడం లేదు. దీనికితోడు ఎండాకాలం కావడంతో బీర్లకు యమ గిరాకీ పెరిగింది. ఎన్నికల సమయం కావడంతో తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఇకపోతే మద్యంపై అదుపు లేకుండా పోతోంది. ఇటీవల వరుసగా గంజాయి, మాదక ద్రవ్యాల పట్టివేత సంచలనంగా మారింది. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని తనిఖీలు ముమ్మరం చేయడంతో డ్రగ్స్‌తో పాటు, గంజాయి పట్టుబడుతోంది. ఇకపోతే సులువుగా డబ్బు సంపాదించాలనుకున్న వారు ఈ వ్యాపారంలోకి దిగుతున్నారు. విస్తుగొలిపే విషయం ఏమంటే చదువుకున్న ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఇందులో పడిపోతున్నారు. తేలికగా డబ్బు సంపాదన కోసం ఈ వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు. మరోవైపు మద్యం, గంజాయి వంటివి అందుబాటులో ఉండడంతో జులాయిలు అకృత్యాలకు తెగబడుతున్నారు. ఎపిలో మద్యం ధరలు పెంచినా అమ్మకాలు ఆగడం లేదు. మద్యం ప్రధాన ఆదాయవనరు కావడంతో తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలపై అజమాయిషీ లేకుండా పోతోంది. బ్రాండ్ ఏదైనా డబ్బులు తెచ్చి పెడుతోంది. ఇటీవల గంజాయి కూడా విపరీతంగా పట్టుబడు తోంది. ఎంతగా స్వాధీనం చేసుకున్నా రవాణా ఆగడం లేదు. దీనికి కారణం మార్కెట్లో డిమాండ్ కారణంగా గంజాయి పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎపితో పోలిస్తే తెలంగాణలో మద్యం అమ్మకాలు పెరిగాయి. మద్యం అమ్మకాలతో పాటు నేరాలు, ఘోరాలు కూడా పెరుగుతున్నాయి. మద్యం మత్తులోనే నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు కూడా అంగీకరిస్తున్నారు. అత్యాచారలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు ఇలా అనేక రకాలైన నేరాలకు మద్యం కారణం అవుతోంది. సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని అధికారంలోకి వచ్చిన ఎపి సిఎం జగన్ ఇప్పుడా ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల్లో కనీసం మాటమాత్రంగా అయినా మాట్లాడడం లేదు. మద్యం అమ్మకాలు లేకపోతే ప్రభుత్వం నడిచే పరిస్థితిలో లేదు. దీంతో మద్యం అమ్మకాలను బాహాటంగానే ప్రోత్సహిస్తున్నారు. ఇష్టం వచ్చిన బ్రాండ్లతో అమ్మకాలు చేసి ఖజానా నింపుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడా..ఇక్కడా అన్న తేడా లేకుండా నేరాలు పెరుగుతున్నాయి. అంతెందుకు ఎన్నికల ప్రచార వేళ అమ్మకాలు పెరిగాయి. పార్టీ కార్యకర్తలకు మందు లేనిదే కాలు బయట పెట్టడం లేదు. ఏ పార్టీ అయినా మద్యం, ముక్క ఉండాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నకల తేదీలు దగ్గర పడుతున్న వేళ..అన్ని పార్టీల కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనాల్లో మద్యంతోపాటు ముక్క లేనిదే కదలడం లేదు. అత్యాచార ఘటనల్లో అనేకం కేవలం మద్యం కారణంగానే జరిగినట్లుగా గుర్తించారు. రేపిస్టులకు కఠిన శిక్షలు పడితే ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవు. ప్రభుత్వం తాము కఠినంగా ఉన్నామని అనుకుంటే సరిపోదు. కఠినంగా ఉంటున్నారన్న సందేశం ప్రజల్లోకి వెళ్లగలిగేలా చేయాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు జరగవు. అలా చేయాలనుకున్న వారు కూడా జంకుతారు. అక్రమాలు, అకృత్యాలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉండడం వల్లనే దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. అవి ఒక్క ఎపిలోనే జరుగుతున్నాయని చెప్పడానికి లేదు. తెలంగాణతో పాటు ఘనత వహించిన యూపిలో కూడా జరుగుతూనే ఉన్నాయి. గొప్పలుచెప్పుకుంటున్న కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉన్న కేరళలోనూ జరుగుతున్నాయి. రాక్షసులకు ప్రాంతం ఏదన్నది ముఖ్యం కాదు. రాక్షస ప్రవృత్తి ఉన్నవారు ప్రపంచమంతా నిండి ఉన్నారు. అలాంటి వారికి మద్యం తోడవుతోంది. వారికి కఠిన శిక్షలు అమలు చేయాల్సి ఉంది. విపక్షాలు కూడా అధికార పక్షాన్ని విమర్శించడం, రాజకీయ లబ్దికోసం నానాయాగీ చేయడం సరికాదు. ఇలాంటి డ్రామాలు కట్టిపెట్టి సంఘటన జరిగినప్పుడు ఉమ్మడిగా ఎలా ముందుకు వెళ్లాలన్న ఆలోచన చేయాలి. ఇకపోతే ఇటీవల చోటు చేసుకుంటున్న సామూహిక అత్యాచార ఘటనలను చూస్తే సామాన్యలకు కూడా భయమేస్తోంది. బయటకు రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఉంది. చిన్న పిల్లలను కూడా వదలడం లేదు. కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధించి కొంత ఊరటను కలిగిస్తున్నాయి. ఇలాంటి ఘటనలన్నింటికి మద్యపానం, మాదక ద్రవ్యాల వాడకం అన్నది ప్రధాన కారణమవుతోంది. ఆయా ఘటనల్లో నిందితులు పూటుగా మద్యం సేవించి.. ఆ మైకంలో ఉచ్ఛనీచాలు మరచి దుశ్చర్యలకు తెగబడుతున్నారు. మద్యం, గంజాయి విచ్చల విడిగా లభిస్తుండటంతో ఆ మైకంలో పైశాచికత్వానికి ఒడిగడుతున్నారు. అత్యాచార ఘటనల్లో అరెస్టవుతున్న నిందితుల్లో 60 శాతం మంది వరకూ మద్యం మత్తులో ఉన్నప్పుడే ఆ పైశాచిక చర్యకు పాల్పడుతున్నట్లు వెల్లడవుతోంది. మద్యం విచ్చలవిడిగా అమ్మడం,మాదక ద్రవ్యాల విషయంలో కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో పాలకులు గుర్తించాలి. మత్తులో పేట్రేగుతున్న ఉన్మాదులు..వరుసగా సామూహిక అత్యా చార ఘటనలకు పాల్పడుతున్న తీరును ఎలా ఎదుర్కోవాలన్న ఆలోచన చేయాలి. అత్యాచార ఘటనల నిరోధానికి ఉమ్మడిగా పోరాడాలి. అనేక అత్యాచార ఘటనల్లో నిందితులు మద్యం మత్తులో రెచ్చిపోతు న్నారు. మద్యం, గంజాయి విచ్చలవిడిగా లభిస్తుండటంతో ఆ మైకంలో పైశాచికత్వాన్ని ప్రదర్శి స్తున్నారు. దీనికి ఫలానా వారు ప్రభుత్వంలో ఉన్నారు కనుక వారే బాధ్యులని నిందించలేం. ఎందుకంటే వారు చేసే అకృత్యాలకు అధికారపార్టీ వారు లైసెన్స్ ఇవ్వలేదు. వారు మద్యం మత్తులో చేసే ఘటనలు కనుక మద్యం అమ్మకాలపై ఆలోచన చేయాలి. ఇలాంటి ఘటనల్లో దోషులకు కఠిన శిక్షలు వేసేలా చేయాలి. మత్తులో ఉన్నవారికి విచక్షణ ఉండదు. తమ చర్యలపై నియంత్రణ ఉండదు. పశువాంఛ బయట పడే క్రమంలో అమానుష చర్యలకు తెగబడుతుంటారు. అలాంటి సందర్భాల్లో బాధితులు ఎవరైనా వారిని ఎదిరించినా, వారి నుంచి తప్పించు కోవటానికి ప్రయత్నించినా మరింత రెచ్చిపోతారు. హింసాత్మక చర్యలకు దిగుతారు. వీటిని మానసిక నిపుణులు కూడా అంగీకరిస్తున్నారు. మద్యం మత్తులో ఉండే వ్యక్తికి అదే మైకంలో ఉన్న మరో ఇద్దరు, ముగ్గురు తోడైతే వారి పశుత్వానికి అడ్డూ అదుపు ఉండదు. అలాంటి సందర్భాల్లో వారికి నిస్సహాయంగా, ఎదురించలేని స్థితిలో మహిళలు ఎవరైనా కనిపిస్తే అఘాయిత్యానికి తెగబడతారు. తాను ఒక్కడినే కాదని.. తనతో పాటు మరి కొందరు ఉన్నారన్న భరోసాతో మరింతగా రెచ్చి పోతారు. తమవల్ల వారికి ఏమవుతుందో అన్న భయం కానీ..తరవాత తామేవుతామో అన్న ఆలోచనకానీ ఆ సమయంలో ఉండదు. మత్తులో ఉన్న వారిలో దూకుడు స్వభావం, విపరీత ధోరణి ఉంటుంది. ఇదే నేరాలకు దారి తీస్తోంది.విపరీత ప్రవర్తన, సమాజంపై ద్వేష భావం ఉండేవారికి మద్యం మత్తు తోడైతే అది తీవ్రమైన నేరాలకు కారణమవుతుంది. అందువల్ల మద్యం,గంజాయి లభ్యం కాకుండా అరికట్టే మార్గాలు ఆలోచించాలి. అప్పుడే సమాజంలో ప్రశాంత వాతావరణం రాగలదు.





రామ కిష్టయ్య సంగన భట్ల..
9440595494

# సంగీత సామ్రాజ్య రారాజు త్యాగరాజు

## మే 4 : నాదబ్రహ్మ త్యాగయ్య జయంతి

అసంఖ్యాక కీర్తనలకు ప్రాణం పోసి, కర్ణాటక సంగీతంలోని నియమాలను సోదాహరణంగా నిరూపించి, కర్ణాటక సంగీతానికి మూల స్తంభమై, త్రైమూర్త్య వాగ్గేయకారులలో ఒకరై, నాదోపాసన ద్వారా, భగవంతుని తెలుసుకో వచ్చునని నిరూపించి, ఆరాధనీయులు అయినారు... త్యాగయ్య, త్యాగబ్రహ్మగా వినుతికెక్కిన వాగ్గేయ కారుడు కాకర్ల త్యాగరాజు, త్యాగయ్య కీర్తనలు, శ్రీరామునిపై ఆయనకుగల విశేష భక్తిని, వేదాలపై, ఉ పనిషత్తులపై ఆయనకున్న జ్ఞానాన్ని తెలియ పరుస్తాయి. ఉపనయనం తరువాత తండ్రిగారి బోధలు, 18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన రామ షడక్షరీ మంత్ర ప్రభావం, తల్లి అలవర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగ రాజస్వామి వారిలో మూర్తీభవించాయి. నేటి ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా కంభం మండలం కాకర్ల గ్రామంలో, 1767 లో మే 4న, తెలుగు వైదిక కుటుంబీకులైన కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ పుణ్య దంపతులకు త్యాగరాజు మూడవ సంతానంగా జన్మించారు. ఆయన జన్మనామం కాకర్ల త్యాగ బ్రహ్మం. ములకనాడు తెలుగు బ్రాహ్మణులు, త్రిలింగ వైదీకులు, అయన పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా కంభం మండలంలో కాకర్ల అను గ్రామం నుండి తమిళ దేశానికి వలస వెళ్లారు.

తండ్రి తంజావూరు ప్రభువు శరభోజి వద్ద ఉండే వారు. తాత గిరిరాజ కవి. త్యాగ బ్రహ్మం విద్యకోసం, తిరువారూర్ నుండి తిరువయ్యూరు వెళ్లారు. అక్కడ సంస్కృతం, వేద వేదాంగములు ఆమూలాగ్రంగా పఠించి, శొంఠి వెంకట రమణయ్య వద్ద, భక్తిశ్రద్ధలతో సంగీతంలో ప్రావీణ్యం సంపాదించు కున్నారు. తండ్రి పిన్న వయసు నందే స్వర్గ ప్రాప్తి నొందగా, అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కారంలో, తమ వంతు వచ్చిన, శ్రీరామ లక్ష్మణ కుల విగ్రహాలను పూజిస్తూ, "ఉ ఛ" వృత్తి స్వీకరించి, ఇష్ట దైవమైన శ్రీ రాముని పై కృతుల రచనలో అధికభాగం గడిపారు. త్యాగయ్య 96 కోట్ల శ్రీరామ నామ జపం ఆచరించి భగవద్దర్శనం, ఆశీర్వచనం పొందారని చెబుతారు. 18 ఏళ్ల వయసులో, పార్వతి అనే యువతిని వివాహ మాడారు. పార్వతి చిరు ప్రాయ మరణంతో, ఆమె సోదరి కమలను పరిణయ మాడారు. సీతా లక్ష్మి అనే కూతురు కలిగింది, ఆమె ద్వారా మనమడు కూడా కలిగాడు.

కానీ, మనమడు చిన్నతనం లోనే మృతి చెందడంతో, ఆయనకు వారసులు లేకుండా పోయారు. శొంఠి వెంకట రమణయ్య శిష్యరికంలో 13వ ఏటనే "నమో నమో రాఘవా" అనే కీర్తనను "దేశిక తోడి రాగం"లో స్వరపరిచారు. త్యాగరాజు మంచి వైణికులు కూడా. గురువుగారి గృహములో చేసిన కచేరీలో, త్యాగరాజ పంచరత్న కృతులలో ఐదవది అయిన, "ఎందరో మహానుభావులు" కీర్తన స్వరపరచి గానం చేశారు. త్యాగయ్య గొప్పతనాన్ని గుర్తించిన గురువు, తంజావూరు రాజుకు చెప్పగా, ఆ రాజు ధన, కనక, వస్తు, వాహనాలతో సభకు ఆహ్వానించాడు. కానీ తనకు "నిధి కన్నా రాముని సన్నిధి సేవే సుఖమ"ని భావించి, త్యాగయ్య అన్నింటిని తిరస్కరించారు. సంగీతంలో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం కన్నా, భగవదారాధనకు ఒక సాధనంగానే చూశారాయన. తంజావూరు రాజు కానుకల తిరస్కార ఫలితంగా, సోదరుడు జపేశుడు, త్యాగయ్యచే నిత్య పూజలందుకునే, శ్రీరామ పట్టాభిషేకం విగ్రహాలను, కావేరీ నదిలో విసిరి వేయగా, శ్రీరామ వియోగాన్ని భరించలేక... దక్షిణ దేశ యాత్రలు చేసి, ఎన్నో ఆలయాలు, తీర్థ క్షేత్రాలను దర్శించారు. ఈ క్రమంలో అత్యద్భుత కీర్తనలను రచించారు.

"రామేతి మధురం వాచం" అన్నట్లు 96 కోట్ల సార్లు రామ నామాన్ని జపించి, స్వీయానుభవ భావనలే కృతి రూపంలో మలచి గాంధర్వగాన మధురానుభూతిగా లోకానికి అందించారు. భూలోక నారదుడైన త్యాగరాజ స్వామికి, దేవ ఋషి అయిన "నారదుడే స్వయంగా సంగీతంలోని రహస్యాలను చెప్పి, "స్వరార్ణవము" ఇచ్చినట్లు, సందర్భంలోనే "సాధించెనే మనసా" అనే పంచ రత్న మాలిక లోని మూడవ కృతి చేసినట్లు ప్రాచుర్యంలో ఉన్నది. నారద అనుగ్రహ ఫలితంగానే అనేక విషయాలు గ్రహించి, 24వేల రచనలు, 800కీర్తనలు గావించాడు. మంత్రోపదేశంతో "స్వర్ణార్ణవం, నారదీయం" అనే రెండు సంగీత రహ స్యార్థ శాస్త్ర గ్రంథ రచనలు గావించారు. త్యాగయ్య కృతులను ప్రాపంచికం, తాత్వికం, కీర్తనం, నిత్యానుష్టానం, అని నాలుగు విధాలుగా గుర్తించారు. చాలావరకు తెలుగులో రచనలు చేసినా, అవి తెలుగు నాట కన్నా, తమిళ నాట ఎక్కువ ప్రాచుర్యం పొందాయి.

జగదానంద కారకా అనే కీర్తన శ్రీరాముని 109 నామాలను ఉటంకిస్తుంది. "జగదానంద కారకా (నాట), దుడుకు గల (గౌళ), సాధించినే (అరభి), ఎందరో మహాను భావులు (శ్రీ), కన కన రుచిరా (వరాళీ.. అనేవి పంచ రత్న మాలికగా, "త్యాగరాజ ఆరాధనోత్సవాలలో ప్రారంభం కీర్తనలుగా గానం చేయ బడతాయి. త్యాగరాజ స్వామి పరమపదించిన దినమైన, పుష్య కృష్ణ పక్ష పంచమి నాడు, శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధానంగా తమిళనాడు లోని తంజావూరు జిల్లా తిరువయ్యూరు లోని, త్యాగయ్య సమాధి ప్రాంగణాన, ఉత్సవాలు ఏటా జరుగుతాయి. త్యాగయ్య 1847 జనవరి 6న తన 79వ ఏట మరణించగా, ఆయన మరణానికి ముందు సన్యాసిగా మారగా, ఆయన భౌతిక కాయాన్ని కావేరీ తీరాన ఖననం చేసి, అక్కడ స్మారక చిహ్నాల నిర్మాణం గావించారు. ఆయన శిష్యగణం అక్కడే సంస్కరణ కార్యక్రమాలు జరుపగా, 1903 తర్వాత పట్టించుకునే స్థితిలో, ప్రముఖ సంగీత విద్వాంసులైన, ఉ మయాల్పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్లు తమ గురువు సమాధి దయనీయ స్థితికి చలించి, పునరుద్ధరణ గావించారు. 1905లో త్యాగయ్య వర్ధంతి దినాన తిరువయ్యూరులో, అన్నదానం, సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. నాటినుండి దేశంలో పలుచోట్ల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తుం డడం అనవాయితీగా వస్తున్నది. అలాగే త్యాగయ్య జన్మదినం రోజుని భారతీయ సంగీత దినోత్సవంగా జరుపు కుంటారు.

# ఆకలి లేని ప్రపంచం సాధ్యమేనా...?

ప్రపంచంలో కుల, మత, లింగ, ప్రాంత బేధం లేకుండా అందరికీ సామాన్యమైనది ఆకలి. మూడక్షరాల పదమే కాదు. మూడు పూటలా ప్రతీ ఒక్కరూ పొందే అనుభూతి. ఆకలి తీరడానికి తీరకపోవడానికి కారణాలు ఏవైనా కావచ్చు. వాటికి ఆకలి, ఆహార అభద్రత, ఆహార సంక్షోభం లాంటి రకరకాలైన సాంకేతిక పేర్లు కలిగిఉండొచ్చు. ఆకలితో ఉన్నవారికి ఇవేవీ అవసరం లేదు. ఆకలితో ఆహారాన్ని పొందలేకపోవడం ఆహార హక్కును తీవ్రంగా ఉల్లంఘించడమే.



**2022 కంటే రెట్టింపు:**

ఏప్రిల్ చివరి వారంలో గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఫుడ్ క్రైసిస్ 2024 నివేదిక 2023లో 59 దేశాలలో 1.3 బిలియన్ల జనాభాను విశ్లేషించింది. దీనిని ఆకలి, ఆహార సంక్షోభం, తీవ్రమైన ఆహార అభద్రతపై సమగ్ర విశ్లేషణను ఫుడ్ సెక్యూరిటీ ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ ప్రతీ ఏడాది విడుదల చేస్తుంది. దీని తయారీలో యునైటెడ్ నేషన్స్ ఏజెన్సీలు, యూరోపియన్ యూనియన్, యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ మొదలైన 16 ఏజెన్సీలు పాల్గొంటాయి. ప్రపంచ వ్యాప్తంగా 2023లో యుద్ధం, వాతావరణ గందరగోళం, జీవన వ్యయం, సంక్షోభం వంటి వాటి వలన దాదాపు 300 మిలియన్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. కారణంగా ప్రపంచంలో చాలా మంది పిల్లలు ఆకలితో చనిపోయే స్థితి వచ్చింది. కరువు అంచున ఉన్న ప్రజల సంఖ్య 7,00,000 కి పెరిగింది. ఇది 2022 సంఖ్య కంటే దాదాపు రెట్టింపు. అధిక స్థాయి ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న జనాభా వాటా 2022 కంటే స్వల్పంగా తక్కువగా ఉంది. అయితే కోవిడ్-19కి ముందు కంటే ఇంకా ఎక్కువే. 2022 కంటే ప్రభావితమైన వారి సంఖ్య 24 మిలియన్లకు పెరిగింది. ఇది వరుసగా ఐదవ సంవత్సరం పెరుగుదలను సూచించింది. 2023లో 281.6 మిలియన్ల ప్రజలు లేదా విశ్లేషించబడిన 59 ఆహార సంక్షోభ దేశాల జనాభాలో 21.5 శాతం మంది అధిక స్థాయిలో తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొన్నారు.

మొత్తం 59 దేశాలలో 18 దేశాలలో ఉన్న 71.9 మిలియన్ ప్రజలు వాతావరణ తీవ్రతల వలన 21 దేశాలలో ఉన్న 75.2 మిలియన్ ప్రజలు ఆర్థిక షాకుల వలన 20 దేశాలలో ఉన్న 134.5 మిలియన్ ప్రజలు సంక్షోభం లేదా అభద్రత వలన అధిక తీవ్ర ఆహార భద్రతను ఎదుర్కుంటున్నారు. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, నైజీరియా, సూడాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇథియోపియా, యెమెన్, సిరియన్ అరబ్ రిపబ్లిక్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, మయన్మార్లు 2023లో ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార సంక్షోభం ఉన్న దేశాలుగా నిలిచాయి.

**గాజా, సూడాన్లలో...**

సూడాన్ ప్రపంచంలోనే అత్యంత ఘోరమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దాదాపు మూడోవంతు జనాభాకు అత్యవసర ఆహార సహాయం అవసరం. 2023 చివరి నాటికి గాజా స్ట్రిప్ జనాభాలో దాదాపు 80 శాతం మంది అంతర్గతంగా స్థానభ్రంశం చెందారు. సుడాన్, గాజా రెండింటిలో సంఘర్షణ పరిస్థితుల కారణంగా 59 దేశాలలో బలవంతంగా స్థానభ్రంశం చెందిన వారి సంఖ్య 90 మిలియన్లకు చేరుకుంది. ఇది నేరుగా 135 మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసింది. 2023లో గాజా స్ట్రిప్ అత్యంత తీవ్రమైన ఆహార సంక్షోభం ఉన్న ప్రాంతంగా మారింది. ఇజ్రాయెల్ బాంబు దాడుల వలన ప్రజలు కడుపు నింపుకోడానికి అవసరమైన ఆహారాన్ని కొనుగోలు చేయడానికి వారి ప్రాథమిక ఆస్తులను అమ్ముకుంటున్నారు. కొందరు ఆకలితో చనిపోయారు. సుడాన్ ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్గత స్థానభ్రంశం సంక్షోభంగా మారింది. సుడాన్‌లో ఏడాది పొడవునా అంతర్యుద్ధం భారీ అంతర్గత స్థానభ్రంశం ఆహార అభద్రతకు దారితీసింది. జూలై 2024 నాటికి గాజాలో 1.1 మిలియన్ల మంది దక్షిణ సూడాన్‌లో 79,000 మంది కరువును ఎదుర్కొంటారని అంచనా వేయబడింది.

**పోషకాహారలోపంతో స్థానభ్రంశం:**

32 దేశాలలో ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న 36 మిలియన్ల మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. 2023లో ముఖ్యంగా స్థానభ్రంశం చెందిన జనాభాలో తీవ్రమైన పోషకాహార లోపం మరింత తీవ్రమైంది. తీవ్రమైన ఆహార అభద్రతకు సంఘర్షణ, అభద్రత, ఆర్థికషాక్ అనే మూడు ప్రాథమిక కారణాలను నివేదిక గుర్తించింది. సంఘర్షణ, అభద్రత 20 దేశాలలో 135 మిలియన్ల ప్రజలను, ఆర్థిక షాక్‌లు 21 దేశాలులో 75 మిలియన్ల ప్రజలను ప్రభావితం చేశాయి. ఈ కారకాలు ఒకదానికొకటి సంబంధం ఉంటాయి. సుదీర్ఘమైన ఆహార అభద్రత, పోషకాహార లోపాన్ని భరించే జనాభా ఆహార సంక్షోభానికి గురవుతుంది. ఆహార వ్యవస్థ దుర్బలత్వం, గ్రామీణ అట్టడుగున పేలవమైన పాలన, అసమానతలను తీవ్రతరం చేస్తాయి. ఇది భారీ జనాభా స్థానభ్రంశంకు దారి తీస్తుంది.

**పరిష్కారాలు:**

దీనికి పరిష్కారంగా సంక్షోభ సంసిద్ధత, క్లిష్టమైన ప్రాణాలను రక్షించే సహాయం, ఆహార సంక్షోభాలకు వ్యతిరేకంగా గ్లోబల్ నెట్‌వర్క్, శాంతి, నివారణ అభివృద్ధి చర్యలను ఏకీకృతం చేసే విధానాలు అవసరం. ఆహార వ్యవస్థలను మార్చడానికి గ్రామీణాభివృద్ధిని పెంచడానికి దీర్ఘకాలిక జాతీయ అంతర్జాతీయ పెట్టుబడులు ఆవశ్యకం. కరువు నివారణకు ఏకైక మార్గం అతి తక్కువ సమయంలో సరిపడా ఆహార పదార్థాలను సత్వరం సరఫరా చేయాలి. మానవత్వం దీనిని మెరుగ్గా చేయగలదు. చేయాలి కూడా. నిబద్ధతతో సమిష్టి చర్యతో కలిసి మనం చేయగలం. ఆకలితో ఒక్క ఇల్లు కూడా లేని ప్రపంచాన్ని సృష్టించాలి.



జనక మోహన రావు దుంగ
8247045230

## రాహుల్ గాంధీ ప్రధాని ఐతే తప్ప
# రిజర్వేషన్లను కాపాడే వారు లేరు

### ధర్మపురి నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో వంశి ని గెలిపించాలి -సీఎం రేవంత్ రెడ్డి

(రాజేష్ బొంగురాల జిల్లా ప్రతినిధి)
జగిత్యాల మే 03(ప్రజా మంటలు) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రోజున ఎండపెల్లి మండలం రాజరాం పల్లె గ్రామంలో నిర్వహించిన జన జాతర సభ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్యే విజయ రమణారావు,ఎమ్మెల్యే వివేక్,ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ఎమ్మెల్యే వినోద్ పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కొప్పుల ఈశ్వర్ మీకు తెల్వనోడు కాదనీ,గత ఎన్నికల్లో మోసం చేసి గెలిచిన ఈశ్వర్ నీ ఈ ఎన్నికల్లో బండకేసి కొట్టి లక్ష్మణ్ కుమార్ ని గెలిపించారని,బిఆర్ఎస్ నుండి అభ్యర్థి ఎవరు లేకపోవడంతో ఈశ్వర్ నీ నిలబెట్టారని,వారికి ఎంపీగా నిలబడే నైతిక అర్హత కూడా లేదనీ,బి.ఆర్.ఎస్ సచ్చిన పాము అని,కొన ఊపిరితో ఉందని,దాని పడగ మీద ఓటు అనే దెబ్బ కొడితే బి.ఆర్.ఎస్ పిడ విరగడవుతుందని,బీజేపీ ప్రభుత్వం నోరు విప్పితే ప్రతిదీ అబద్ధమేనని,గుజరాత్ ని ఒకలాగ,తెలంగాణని ఒక లాగ చూస్తూ సవతి ప్రేమ చూపిస్తున్నారనీ,ఎందుకు ఇంత వివక్ష చూపిస్తున్నారో చెప్పాలని, రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని,ప్రజలు బీజేపీ కి వేసే ప్రతి ఓటు రిజర్వేషన్ రద్దుకు వేసే పోటు అనిఅన్నారు. రాహుల్ గాంధీ కుటుంబానికి పదవుల వ్యామోహం లేదని,రాహుల్ గాంధీ ప్రధాని ఐతే తప్ప రిజర్వేషన్లను కాపాడే వారు లేరని, ధర్మపురి నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో వంశి ని గెలిపించాలని ఈ సంధర్భంగా కోరారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, పెద్దపెల్లి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తన నియోజకవర్గంలో నిర్వహించిన జన జాతర సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని,గత పది సంవత్సరాల బి ఆర్ యస్ ప్రభుత్వ పాలనలో ధర్మపురి ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, ఈ ప్రాంతానికి ఎమ్మెల్యే గా, విప్ గా,మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ ధర్మపురి ప్రజానీకానికి రైతాంగానికి అవసరమైన సాగు,త్రాగు నీటి సమస్య పరిష్కారం చేయలేదని అన్నారు. ధర్మపురిని రెవెన్యూ డివిజన్ గా కూడా చేయలేదని,ఒక బస్ డిపో కూడా ఏర్పాటు చేయలేదని,పత్తిపాక వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేస్తానని అప్పటి మంత్రి హరీష్ రావు ప్రకటన చేయడం జరిగిందని,ఇప్పటి వరకు దాన్ని ఎక్కడ ఆచరణలో ముందుకు తీసుకెళ్ళలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గారెంటిలలో 5 గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందని,ప్రజా కుటుంబం నుండి వచ్చిన యువకుడు వంశీ గారిని భారీ మెజారిటీతో గెలిపించాలని లక్ష్మణ్ కకుమార్ కోరారు.

# ప్రజల కొరకే తెలంగాణ గురించి పుట్టిన పార్టీ బి అర్ ఎస్

**-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్**



జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 03(ప్రజా మంటలు) : పార్లమెంటు ఎన్నికలలో భాగంగా జగిత్యాల పట్టణంలో 23,24,25,39 వార్డు లలో నిజామాబాద్ పార్లమెంట్ బి అర్ ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ కి మద్దతుగా బి అర్ ఎస్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వచించి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ 5వ తేదీ ఆదివారం కెసిఆర్ రోడ్డు షో ఆహ్వాన కరపత్రాలను ప్రజలకు అందజేసినారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమీకృత మార్కెట్ పనులు పూర్తి అయ్యాయి.ప్రభుత్వ నిర్లక్ష్యం తో 4.5 కోట్ల తో నిర్మించినా నిరుపయోగంగా ఉంది.గతంలో రైతు బజార్ ను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపయోగంగా మార్చింది పట్టణ ప్రజలకు అందరికీ తెలిసిందే,బీట్ బజార్ పరిసర ప్రాంత,జగిత్యాల పట్టణ ప్రజలకు,రైతులకు సమీకృత మార్కెట్ వల్ల చాలా ఉపయోగం,8 కోట్ల తో వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి నిదులు మంజూరు చేయటం జరిగింది,10 ఎకరాల స్థలం కేటాయించడం జరిగింది.నేడు ఫ్రూట్ హబ్ గా జగిత్యాల.మెడికల్ కాలేజీ ఏర్పాటు తో భీద మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగం.బస్తీ దవాఖానా ల ఏర్పాటు తో ప్రజల చెంతకు నాణ్యమైన వైద్యం.ప్రజల గురించి తెలంగాణ గురించి పుట్టిన పార్టీ బి అర్ ఎస్.ఇతర పార్టీలు తెలంగాణ పై సవతి తల్లి ప్రేమ చూపుతాయి.ఇంటి పార్టీ బి అర్ ఎస్ అని అన్నారు.నేడు రాష్ట్రంలో కెసిఆర్ పథకాలు అమలు అవుతున్నాయి.ఉచిత బస్ మినహా కాంగ్రెస్ ఒక్క హామీ నేరవేర్చలేదు.నారి న్యాయ్ అని ప్రతి మహిళకు 1 లక్ష అని తప్పుడు హామీలను కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని, బిజెపి కాంగ్రెస్ పార్టీ లు రెండు తోడు దొంగలని అన్నారు.

ఇంకా, మహిళల కు 2500 పథకం,4 వెలు పెన్షన్ హామీ ఏమైంది అని ప్రశ్నించారు.కెసిఆర్ హయం లో కుల వృత్తులు కుల సంఘాల అభ్యున్నతికి కృషి.డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం ఒక చరిత.మిషన్ భగీరథ పథకం ద్వారా జగిత్యాల పట్టణం లో 50 కోట్ల నిధులతో ప్రజలకు మంచి నీరు అందించాం.ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం వల్లనే జగిత్యాల లో బి అర్ ఎస్ కి మెజారిటీ.ప్రజలు బి అర్ ఎస్ వైపే ఉన్నారని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు.

బాజీరెడ్డి గోవర్దన్ సీనియర్ నాయకులు,సేవా భావం కలిగిన వ్యక్తి.4సార్లు వేరు వేరు చోట్ల ఎమ్మెల్యే గా గెలిచారని ప్రజా ఆదరణ ఉన్న వ్యక్తి అని అన్నారు.కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆదివారం కెసిఆర్ రోడ్డు షో కి హాజరై విజయవంతం చేయాలని కోరారు. జగిత్యాల పట్టణ బి అర్ ఎస్ పార్టీ నాయకులు సమిండ్ల శ్రీనివాస్,ఆనంద్ రావు, పవన్,రాజ్ కుమార్,చందాపృథ్వి, ధుమల రాజ్ కుమార్, తొలిప్రేమ శ్రీనివాస్,శరత్ రావు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పార్లమెంటరీ ఎలక్షన్ అబ్జర్వర్ గా సీనియర్ న్యాయవాది కల్లేపల్లి లక్ష్మయ్య



కరీంనగర్ మే 03(ప్రజా మంటలు) :
కరీంనగర్ లోక్ సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ ఎలక్షన్ లీగల్ అబ్జర్వర్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్, సీనియర్ న్యాయవాది కల్లేపల్లి లక్ష్మయ్యను ఏఐసీసీ లీగల్ టీం కోఆర్డినేటర్ సి దామోదర్ రెడ్డి నియమించారు. తనకు బాధ్యతలు అప్పగించిన దామోదర్ రెడ్డి, తన నియామకానికి సహకరించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లకు లక్ష్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ లో చేరిన మాజీ కౌన్సిలర్లు వీరబత్తిని శ్రీనివాస్-పద్మజ

### కండువా కప్పి ఆహ్వానించిన టీ. జీవన్ రెడ్డి

జగిత్యాల మే 03 (ప్రజామంటలు): కాంగ్రెస్ లో చేరిన మాజీ కౌన్సిలర్లు, జిల్లా పద్మశాలి సేవా సంఘం కార్యదర్శి వీరబత్తిని శ్రీనివాస్ -పద్మజ లను కండువా కప్పి ఆహ్వానించిన శ్రీ టీ.జీవన్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కన్న తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని వీడి టిఆర్ఎస్ పార్టీలోకి గత కొన్ని మాసాల క్రితం వెళ్లినప్పటికీ జీవన్ రెడ్డి మంచి మనసును దూరం చేసుకున్నామన్న బాధ అనుక్షణం వెంటాడిందని, ప్రస్తుతము జరుగుచున్న లోకసభ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ పక్షాన జీవన్ రెడ్డి బరిలో ఉన్నందున



అహర్నిశలు కష్టపడి వారి గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు. పద్మశాలి కుల బాంధవులకు సరైన గౌరవము ప్రోత్సాహము, సమాజంలోని అన్ని వర్గాలకు సరియగు న్యాయం జీవన్ రెడ్డి ద్వారానే లభిస్తుందన్న విషయాన్ని మరొక్కసారి గుర్తు చేస్తూ మాకు మళ్లీ మాతృసంస్థకు రావడానికి అంగీకరించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. మాజీ పురపాలక సంఘ అధ్యక్షులు గిరి నాగభూషణం, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కమటాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొక్కుల (పిఏ) గంగాధర్, పల్లెర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ కూలీల దగ్గర జోరుగా కాంగ్రెస్ నాయకుల ఎన్నికల ప్రచారం

మహాదేవపూర్ మే 03(ప్రజా మంటలు) : మహాదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్ ఆద్వర్యం లో పెద్దంపేట ఉపాధి హామీ కూలీల దగ్గర కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి వంశిక్రిష్ణ కు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు పలువురు నాయకులు మాట్లాడుతూ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ప్రతీ మహిళకు సంవత్సరానికి లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుందని ఉపాధి హామీ కూలీలకు నాలుగు వందల రూపాయలు అమలు చేస్తామని అన్నారుఈ కార్యక్రమంలో జడ్పిటిసి గుడాల అరుణ శ్రీనివాస్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ సర్పంచ్ విలాస్ రావు జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడీ శ్రీనివాస్ రెడ్డి సీనియర్ నాయకులు వామాన్ రావు ,వరప్రసాద్ ,మహిళ నాయకురాలు ఒడేటి పద్మ మాజీ సర్పంచ్ బల పోషం,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లేతకరి రాజబాబు ఎస్టి సెల్ మండల అధ్యక్షులు చంద్రమౌళి మండల ప్రధాన కార్యదర్శి శంకరయ్య ,తిరుపతి రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు షకీల్ నాగరాజు రాఘవేంద్ర , సోహెల్ సమ్మయ్య సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



## స్పెషల్ జాకెట్ ధరించి 20 లక్షల నగదు, 25 తులాల బంగారం తరలింపు

### తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఖమ్మం పోలీసులు

ఖమ్మం మే 03 (ప్రజామంటలు):
ఖమ్మం లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా టూ వీలర్‌పై విజయవాడ వైపుకు వెళ్తున్న వ్యక్తిని తనిఖీ చేయగా, వ్యక్తి రెండు చొక్కాలు తొడుక్కుని దానికి జేబులు కుట్టి%శీ%చి దాంట్లో 20 లక్షల నగదు, 25 తులాల బంగారాన్ని దాచాడు. ఖమ్మం రూరల్ సీఐ ఆ వ్యక్తి దగ్గర నుండి అ నగదును మరియు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తిని పోలీసులు విజయవాడకు చెందిన వ్యాపారిగా గుర్తించినట్లు సమాచారం.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బి.ఆర్.ఎస్ మాజీ సర్పంచులు

జమ్మికుంట మే 03 (ప్రజామంటలు): మొన్నటి వరకు బిఆర్ఎస్ పార్టీ కి పట్టుకొమ్మల్లా ఉన్న గ్రామాల్లోని మాజీ సర్పంచులు, నాయకులు క్రమక్రమంగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బి.ఆర్.ఎస్ మాజీ సర్పంచులు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, ఆధ్వర్యంలో జమ్మికుంట బి.ఆర్.ఎస్. మాజీ సర్పంచల ఫోరం అధ్యక్షుడు శంభునిపల్లి మాజీ సర్పంచ్ మాదిరెడ్డి వెంకటరెడ్డి, పాపక్కపల్లి మాజీ సర్పంచ్ కాట్మండి మహేందర్, తనుగుల మాజీ సర్పంచ్ చిలుముల వసంత రామస్వామి, శాయంపేట మాజీ సర్పంచ్ భద్రయ్య, శంభుంపల్లి బి.ఆర్.ఎస్ గ్రామ అధ్యక్షులు సదానందం, బి.ఆర్.ఎస్. యూత్ అధ్యక్షులు మదిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వీరితోపాటు కాంగ్రెస్ నాయకులు మాదారపు లింగారావు, మాధవరావు. పాల్గొన్నారు.



## కొండగట్టు ఆంజన్న ఆదాయం 88 లక్షల మూడు వేల 608నగదు,41 గ్రాముల బంగారం



జగిత్యాల మే 03 (ప్రజా మంటలు జిల్లా ప్రతినిధి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ హుండి లెక్కింపులో తొలిరోజు 88 లక్షల పై చిలుకు ఆదాయంవచ్చినట్లు ఈవో తెలిపారు. మొత్తం 36 హుండిలకు గాను 12 హుండిల లెక్కింపు జరిగింది.తొలి రోజు లెక్కింపులో 88 లక్షల మూడు వేల 608 నగదు.నగదుతోపాటు 41 గ్రాముల బంగారం.రెండు కిలోల 510 గ్రాముల వెండి. 27 విదేశి కరెన్సీ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 24 హుండీలను లెక్కించాల్సి ఉంది.లెక్కింపు సందర్భంగా భారీ భద్రత ఏర్పాటు చేశారు.

# గాంధీ భవన్ వేదికగా కాంగ్రెస్ లోకి భారీ చేరికలు

హైదరాబాద్ మే 03 (ప్రజామంటలు): వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పెబ్బేరు, శ్రీరంగాపురం, పెద్ద మందడి, వనపర్తి మండలాల నుంచి వివిధ పార్టీలకు చెందిన దాదాపు ఒక వేయి మంది నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోదండ రెడ్డి వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీ చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలనకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన వేయి మంది కాంగ్రెస్ పార్టీలో చేరారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశామని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిజమైన ప్రజా పాలన సాగుతోందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందుతుందని చిన్నారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు డాక్టర్ జీ. ఆదిత్య రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేందర్ యాదవ్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



# ఇంటివద్ద ఓటు హక్కు వినియోగించుకున్న వయోవృద్ధులు, అంగవైకల్యం కలవారు



జగిత్యాల మే 03 (ప్రజామంటలు): ఇంటి నుండి బయటికి రాలేని పరిస్తితులలో ఉన్నటు వంటి వయస్సు మల్లిన వృద్దులు, అంగవైకల్యం కలిగిన వారికి ఇంటి నుండి ఓటు హక్కు వినియోగించుకోవడం జిల్లాలో జరుగుతున్నదని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మీన్ బాషా తెలిపారు. లోకసభ ఎన్నికల దృష్ట్యా 85 ఏళ్లకు పై బడిన వృద్దులు, 40 కన్నా ఎక్కువ అంగ వైకల్యం కలిగి ఉంది ఇంటి నుండి బయటికి రాలేని వారికి ఇంటి నుండి ఓటుహక్కు వినియోగించు కోవడానికి జిల్లా వ్యాప్తంగా 36 టీములను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నేటి నుండి రెండు రోజులపాటు హోం ఓటింగ్ ను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజక వర్గం పరిధిలోని కోరుట్ల, జగిత్యాల, పెద్దపల్లి పార్లమెంటు నియోజక వర్గం పరిధిలోని ధర్మపురి నియోజక వర్గం లలో 849 మంది ఉన్నారని, ఇందులో కోరుట్ల నియోజక వర్గంలో 216, జగిత్యాల నియోజక వర్గంలో 374, ధర్మపురి నియోజక వర్గం లో 259 మంది ఓటర్లు హోం ఓటింగ్ వినియోగించు కోనున్నారు అని తెలిపారు. మొదటి రోజున జిల్లా వ్యాప్తంగా 320 హోం ఓటింగ్‌లో పాల్గొని ఓటుహక్కు వినియోగించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# కరెప్షన్స్ పోవాలంటే.. కామన్ మ్యాన్ మారాలి..

## ప్రముఖ రాజకీయ విశ్లేషకులు మహమ్మద్ అంకూస్

**జమ్మికుంట మే 03 (ప్రజామంటలు):** నేటి సమాజ పరిస్థితి ఎలా తయారయింది అంటే..! మనం మారద్దు కానీ మార్పు రావాలి, అవినీతి లేని సమాజం కావాలి, ప్రభుత్వాల ద్వారా ఉచితాలు రావాలి, మనం ఏం పని చేయొద్దు, మన ఇంటి వద్దకే అన్ని రావాలి, కానీ ఓటు వేసేటప్పుడు ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే మా ఓటు... మరి డబ్బులు తీసుకొని ఓటు వేసినప్పుడు మనం కోరుకునే అవినీతి రహిత సమాజం ఎలా ఏర్పడుతుంది. ఎవరో రావాలి ఏదో చేయాలి అంటే అంటే ఏది రాదు ఈ దేశ పౌరుడిగా మన బాధ్యత ఏంటిది అనేది మనం గుర్తించినప్పుడు దేశంలో జరుగుతున్న అవినీతిని అక్రమాలను ప్రశ్నించే అధికారం మనకు ఉంటుంది. నేటి రాజకీయాలు ఎలా తయారయ్యాయి అంటే సామాన్యుడు రాజకీయం చేసే పరిస్థితి లేకుండా పోయింది. మీటింగులు పెట్టాలన్న డబ్బే, కటౌట్లు కట్టాలన్న డబ్బే, ప్రచారం చేయాలన్న డబ్బే, పది మందిని పోగు చేసి పోటీ చేసే వ్యక్తి తను చేసే పనుల గురించి చెప్పాలన్న డబ్బు ఇచ్చి పిలిపించుకొని మరి చెప్పాల్సిన పరిస్థితి తయారయింది. ప్రతి అడుగులో డబ్బు లేనిది రాజకీయాలు చేసే పరిస్థితి లేదు, ఎమ్మెల్యేగా పోటీ చేస్తే 100 కోట్లు, ఎంపీగా పోటీ చేస్తే 500 కోట్లు ఖర్చు చేసే స్థితికి రాజకీయాలు చేరుకున్నాయి, మరి అన్ని డబ్బులు పెట్టి ఖర్చు చేసి గెలిచినటువంటి వ్యక్తి తాను ఎటువంటి స్వార్థం లేకుండా మనకు ఎలా పని చేయగలుగుతాడు అనే విషయాన్ని సామాన్యుడు గమనించినట్లయితే మనం ఆ నాయకుడిని ప్రశ్నించే హక్కును కోల్పోయినటువంటి పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి ప్రజలారా అవినీతి రహిత సమాజం నిర్మించాలంటే, ఆర్థిక సమానత్వం కలిగిన సమాజం ఏర్పడాలంటే, ముందుగా మారాల్సింది మనమే. 'కామన్ మ్యాన్ మారంద్దే కరప్షన్ పోదు' అనే విషయాన్ని గమనించాలి. కామన్ మ్యాన్ ముందుగా ఓటుకు నోటు తీసుకోకుండా భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకున్నట్లయితే ప్రశ్నించే హక్కు అతనికి ఉన్నట్టుగా లెక్క, నేటి సమాజంలో ఒక్కరంటే ఒక్కరు కూడా ఓటుకు నోటు తీసుకోకుండా వేయలేనటువంటి పరిస్థితి దాపురించింది, విద్యావంతులు, ఉద్యోగులు, కోటీశ్వరులు ఓటుకు ఎంత డబ్బులు ఇస్తారు అని అడిగే అటువంటి పరిస్థితి నేటి సమాజంలో తయారయింది. మరికొన్ని విచిత్రాలు చూసినట్లయితే కొన్ని ఎలక్షన్లలో మాకు ఓటుకు డబ్బులు ఇయ్యాలి అని రోడ్డు ఎక్కి ధర్నాలు చేసినటువంటి పరిస్థితి ఏర్పడ్డది. ఈ దుస్థితిని చూసి సమాజంలో ఉన్నటువంటి విజ్ఞానవంతులు తలదించు కోవాల్సినటువంటి పరిస్థితి దాపురించింది. కాబట్టి ప్రజలారా, మేధావులారా, విద్యావంతులారా, ఉద్యోగులారా మన వంతుగా సమాజాన్ని చైతన్యం చేసి ఈ ఓటుకు నోటు అనేటువంటి దానిని సమాజం నుంచి తరిమి వేసినట్లయితే అవినీతి రహిత సమాజం ఏర్పడుతది అనేటువంటి విషయాన్ని గమనించాలి. అందుకే కరప్షన్ పోవాలంటే కామన్ మ్యాన్ మారాలి.





# నరసాపురం రవీందర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**మధ్యాహ్నం 12 గం. నుండి సాయంత్రం 4 గం. వరకు బయట తిరగొద్దు**

గొల్లపల్లి మే 03 (ప్రజామంటలు): గొల్లపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట ప్రాంతంలో శుక్రవారం రవీందర్ స్వచ్ఛంద సేవ సంస్థ నర్సాపురం రవీందర్ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ%ౌ%. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగొద్దని సూచించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి సంవత్సరం చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న నర్సాపురం రవీందర్ ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు మద్దెల గోవర్ధన్, చెవులమాద్ది మల్లేశం, గంగాధర మధుసూదన్, గడుగు విజయ్, ఆటో యూనియన్ సభ్యులు రాజయ్య, గంగన్న, కిరణ్, అశోక్, అంకం భూమయ్య, నరేష్, గోవర్ధన్, జెరిపోతుల అనిల్, శ్రీధర్, నరేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# తలసాని పిలుపు... పజ్జన్న గెలుపు...

**బన్సీలాల్ పేట లో బీఆర్ఎస్ శ్రేణుల ఇంటింటి ప్రచారం**



సికింద్రాబాద్ మే 03 (ప్రజామంటలు): సికింద్రాబాద్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ళ పద్మారావుగౌడ్ కు మద్దతుగా బన్సీలాల్ పేటలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి ప్రచార పాదయాత్రను నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచనల మేరకు తాము గత కొద్ది రోజులుగా ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, నాయకులు ఏసూరి మహేశ్, ఎల్.వెంకటేశన్ రాజు, నామాల ప్రేమ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, రాంబాబు, కుషాల్, శ్రీరాములు, అమృతమ్మ, దుర్గా, కౌసల్య, అనితారెడ్డి, జనార్ధన్, వెంకట్, గజ్జల శ్రీనివాస్, సుధాకర్, మల్లేశ్, లంబు శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, మహేందర్ గౌడ్, ముక్క శ్రీనివాస్, హమ్రాజ్, హరిచారి, అంబిక, నాగి, సుజాత, లక్ష్మీ, వెంకటరమణ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి హుండీ లెక్కింపు రూ. 17,75,572 ఆదాయం



ఇల్లందకుంట మే 03 (ప్రజామంటలు): మండల కేంద్రములోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఏప్రిల్ 15 నుండి 27 వరకు జరిగిన శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ స్వామివారికి కానుకల రూపంలో సమర్పించిన హుండీలను శుక్రవారం లెక్కించగా రూ.17,75,572 లు. వచ్చినట్లు ఈవో తెలిపారు. కానుకల రూపంలో మిశ్రమ వెండి 450 గ్రాములు, బంగారం 13 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో కరీంనగర్ డివిజన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు పి. సత్యనారాయణ, ఆలయ కార్య నిర్వహణ అధికారి కందుల సుధాకర్, ఆలయ అర్చకులు శేషం రామాచార్యులు, శేషం వంశీధరాచార్యులు, మడికొండ నవీన్ కుమార్ శర్మ, లెక్కింపులో శ్రీ వేములవాడ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, శ్రీరామ సేవా సమితి సభ్యులు, భక్తులు, ఆలయ సిబ్బంది జి. రాజయ్య, కే. మోహన్, వి. మల్లారెడ్డి, ఎస్. ప్రవీణ్, ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అపస్మారకస్థితిలో ఉన్న వ్యక్తిని రక్షించి 'మానవత్వం చాటుకున్న మహిళ'




రాయికల్ మే 03 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలోని ఇటిక్యాల క్రాస్ రోడ్ వద్ద ఓ బట్టల దుకాణం ముందు ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో ఉండగా, బట్టల దుకాణం యజమాని 108 కు కాల్‌చేశాడు. 108 వాహనం వారు వచ్చి పరిశీలించి మద్యం మత్తులో ఉన్నాడేమో అని ఊహించుకుని వదిలిపెట్టి వెళ్లారు. దీంతో కాలినడకన వెళ్తున్న రాయికల్ మండలం వస్తాపూర్ గ్రామానికి చెందిన మహిళ అతన్ని చూసి చలించి పక్కింటి వారి వద్దకు వెళ్లి మంచినీరు తీసుకువచ్చి అతన్ని కూర్చోబెట్టి నీరు తాగించి సమీపంలో ఉన్న నీడ ప్రాంతానికి చేర్చారు. దీంతో అపస్మారక స్థితి నుండి ఆ వ్యక్తి కోలుకున్నాడు. ఈ సందర్భంగా స్థానికులు మహిళ మానవత్వాన్ని చూసి అభినందించారు. గత కొన్ని రోజుల క్రితం ఆ మహిళ భర్త చనిపోయాడని అప్పుడు ఎవరు కూడా తనకు సహాయం చేయలేదని తన పరిస్థితి ఎవరికి రాకూడదని ఒక తోబుట్టువులాగా అనుకొని ఆ వ్యక్తికి సహాయం చేసానని ఆ మహిళ మీడియాకు తెలిపింది.



# ప్రజా సమస్యలను పరిష్కరించే 'జీవన్ రెడ్డి' ని ఎన్నుకుందాం

**మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ డా. చంద్రశేఖర్**

**రాయికల్ మే 03 (ప్రజామంటలు):** నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజ సమస్యలను పరిష్కరించే ప్రశ్నించే గొంతుక నిజామాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని పార్లమెంటుకు పంపుదామని మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం, పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.... స్థానికుడైన జీవన్ రెడ్డిని పార్టీలకతీతంగా గెలిపించుకొని నిజామాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి పునాది వేద్దామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గెలిస్తే పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. వ్యవసాయ, పారిశ్రామిక, విద్య, వైద్య, రాజకీయ రంగం వంటి వాటిపై సంపూర్ణ అవగాహన ఉన్న జీవన్ రెడ్డి ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకు కావాలని అలాంటి వ్యక్తిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిజాంబాద్ ఎంపీ గా జీవన్ రెడ్డి గెలిస్తే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా మనం చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభాముఖంగా మనకు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి, కాంగ్రెస్ మండల,పట్టణ అధ్యక్షులు రవీందర్ రావు, మ్యాకల రమేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహిపాల్, నాయకులు పొన్నం శ్రీకాంత్, బత్తిని శ్రీకాంత్, ఉత్కం సాయ గౌడ్, పొన్నం మహేష్, లింగం గౌడ్, బాపురపు రాజీవ్, కాషవేణి రాజేష్, గుజ్జుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి కి మద్దతుగా ఎమ్మెల్యే సంజయ్ ప్రచారం

**జగిత్యాల మే 03 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని పురాని పెట్, జామా మస్జిద్ లలో శుక్రవారం ముస్లిం సోదరుల ప్రార్ధనల అనంతరం వారిని కలిసి ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ కు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించగలరని ప్రచారం చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాల నిషేదంలో ప్రజాప్రతి నిధులను భాగస్వామ్యం చేయాలి

**బాల్య వివాహాలను నిరోధిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఉత్తర్వులు**

**బాల్య వివాహాలు జరిగితే సర్పంచ్లు, కార్పొరేటర్లను బాధ్యులు చేయాలి**

**ఈ ఉత్తర్వులను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని పలు ఎన్జీవో సంస్థల డిమాండ్**

**ఆశ్రిత సంస్థ కో ఆర్డినేటర్ నాగరాజు**



సికింద్రాబాద్ మే 03 (ప్రజామంటలు): బాల్య వివాహాలను నిరోదించేందుకు గాను రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన అత్యవసర ఉత్వర్వులను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని అశ్రిత సంస్థ కోరింది. శుక్రవారం అశ్రితసంస్థ సెక్రటరీ, హైదరాబాద్ జిల్లా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ అలయెన్స్ ప్రతినిధి నాగరాజు మీడియాతో మాట్లాడుతూ..బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే అక్షయ తృతీయ పర్వదినానికి ముందుగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ అలయెన్స్ దాఖలు చేసిన పిల్ పై హైకోర్టు స్పందించడం అభినందనీయమన్నారు. రాజస్థాన్ హైకోర్టు ఆదేశాల మేరకు బాల్య వివాహాలను నిరోధించడంలో విఫలమైతే ఆయా గ్రామాల్లోని సర్పంచ్లు, పట్టణాలు, నగరాల్లో అయితే కౌన్సిలర్లు, కార్పొరేటర్లను బాధ్యులుగా చేయాలని కోర్టు చెప్పడం స్వాగతించదగినదని అన్నారు. కోర్టు ఆదేశాలతో అక్కడ ఇటీవల చాలా బాల్య వివాహాలు ఆగిపోయాయని అన్నారు. ఇలాంటి నిర్ణయాలను దేశ వ్యాప్తంగా అమలు చేస్తే దేశంలో బాల్య వివాహాలు చాలా వరకు తగ్గుతాయన్నారు. రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తులు శుభా మెహతా, పంకజ్ భండారీలతో కూడిన డివిజన్ బెంచ్ బాల్య వివాహాలకు సంబం దించిన పూర్తి నివేదికను అందించాలని అక్కడి ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. మత పెద్దల సమన్వయంతో దేవాల యాలు, చర్చిలు, మస్జీద్ లు, గురుద్వారాల వద్ద బాల్య వివాహా లకు వ్యతిరేకంగా పోస్టర్లను అంటించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో తగిన నిర్ణయాలను త్వరగా తీసుకోవాలని ఆశ్రిత సంస్థ కో ఆర్డినేటర్ నాగరాజు కోరారు.

# ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం

**ప్రెస్ క్లబ్ జేఏసీ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో పండ్లు పంపిణీ**

**మండల ప్రెస్ క్లబ్ జేఏసీ అధ్యక్షులు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్**



**రాయికల్ మే 03 (ప్రజామంటలు):** ప్రజాస్వామ్య వ్యవస్థకు మూల స్తంభంగా,ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న పత్రికలను, పత్రికలలో సైనికులుగా పనిచేస్తున్న పాత్రికేయుల హక్కులను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల ప్రెస్ క్లబ్ జేఏసీ అధ్యక్షులు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్ అన్నారు.ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయికల్ పట్టణంలోని ప్రభుత్వం వైద్యశాలలో గర్భిణీలకు,బాలింతలకు, అలాగే వైద్యం పొందుతున్న వ్యక్తులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గ్రామీణ ప్రజల సమస్యలను, ప్రభుత్వాల, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం తన కలంతో అక్షరాన్ని ఎక్కుపెట్టి, నిరంతరం శ్రమిస్తున్న పత్రిక విలేకరుల ఐక్యతకు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన అన్నారు. పత్రికా స్వేచ్ఛకు, పాత్రికేయుల హక్కులకు సముచిత స్థానం కల్పించి ఐక్యరాజ్యసమితి ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవంగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమని, పాత్రికేయుల హక్కులకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించే ఎంతటి వారైనా చట్టపరంగా శిక్షార్హులేనని వారు పేర్కొన్నారు. అవినీతి మూలాలను అంతమొందించే విధంగా నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో పాత్రికేయులు ముందుండాలని సూచించారు. సమాజం సన్మార్గంలో నడవాలన్న, ప్రభుత్వాల పెత్తనాలు ప్రజలపై తగ్గాలన్న, సమాజంలో అవినీతి అసమానతలు తొలగాలన్న పత్రికకు పాత్రికేయులకు స్వేచ్ఛ కల్పించాల్సిన ఆవశ్యకత అధికార యంత్రాంగంపై ఉన్నదని వారన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న పాత్రికేయ కుటుంబాలను సైతం ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జేఏసీ ఉపాధ్యక్షులు చింతకుంట సాయికుమార్, నాగిరెడ్డి రఘుపతి, సంయుక్త కార్యదర్శి గంగాధరీ సురేష్, కార్య వర్గ సభ్యులు ఇమ్మడి విజయ్ కుమార్, చెలిమెల మల్లేశం, వైద్యులు అందే ఉదయ్ కుమార్, సతీష్, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, మండల ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే దేశ అభివృద్ధి సాధ్యం

రెబ్బన మే 03 (ప్రజామంటలు): కాంగ్రెస్ పార్టీ తోనే దేశ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గోలేటి లోని ఉపాధి హామీ పని స్థలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.... నరేంద్ర మోడీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసం చేసారని అన్నారు. జన్ ధన్ అకౌంట్ లు ఓపెన్ చేసి నల్లధనం వెనక్కి తీసుకొచ్చి అకౌంట్లల్లో వేస్తానన్న డబ్బులు వేయలేదని అన్నారు. ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని అన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కేసీఆర్ కు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఉపాధి హామీ కూలీ రేటు 400 రూ.. లకు పెంచుతామని, ధరలను నియంత్రిస్తామని అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో అడప విమల, దుర్గం రవీందర్, ప్రకాష్ రావు, జిల్లాల స్వామి, సాంబగౌడ్, పుదరి సాయి, దుర్గం తిరుపతి, మంగిలాల్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబు మేనిఫెస్టోలో కానరని పెన్షన్

## బాబు మేనిఫెస్టోలతో మేజిక్ చేస్తాడు

## వాటిని నమ్ముకుంటే అధోగతే

## చంద్రబాబును నమ్మితే చంద్రముఖిని లేపినట్లే

## ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో సిఎం జగన్ ప్రచారం

ఒంగోలు/గుంటూరు,మే3 (ప్రజా మంటలు):
ఏపీలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. అధికార ప్రతిపక్ష పార్టీలు మేనిఫెస్టో కూడా ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుతం చర్చంతా మేనిఫెస్టోలోని హామీల మీదనే జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న పథకాలకే నగదు పెంచి వైసీపీ మేనిఫెస్టో రూపొందించగా, సూపర్6 అంటూ జనాకర్షక పథకాలతో మేనిఫెస్టో రూపొందించారు చంద్రబాబు. ఈ క్రమంలో సీఎం జగన్ కూటమి మేనిఫెస్టో మీద ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు పెన్షన్ హామీని మేనిఫెస్టో నుండి అప్పుడే ఎత్తేశారని, చంద్రబాబు మేనిఫెస్టో మాయలను నమ్మొద్దని అన్నారు. సూపర్6 పేరుతో మొదట మినీ మేనిఫెస్టో ప్రకటించిన చంద్రబాబు, ఆ తర్వాత కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో పెన్షన్ హామీని 5వ పేజీకి షిఫ్ట్ చేశాడు. కాగా, నిన్న ఇచ్చిన ఒక పత్రికా ప్రకటనలో సూపర్6 హామీల్లో పెన్షన్ హామీ లేకపోవడాన్ని ఉద్దేశిస్తూ జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు మేనిఫెస్టో మాయలను నమ్మొద్దని, గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు.ఒక్క నెల ఓపిక పడితే, మళ్ళీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని, పెన్షన్ మళ్ళీ ఇంటికే వస్తుందని జగన్ అన్నారు. చంద్రబాబును నమ్మడమంటే చంద్ర ముఖిని నిద్రలేపినట్టేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పల్నాడు జిల్లా పెదకూరపాడు క్రోసూరు సెంటర్‌లో బహిరంగ సభలో మాట్లాడుతూ చంద్రబాబు మూడు సార్లు సీఎంగా పనిచేశారని చెప్పుకుంటారు.. చంద్రబాబు పేరు చెబితే ఒక్క మంచైనా గుర్తొస్తుందా? అంటూ ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ చూడని పాలనను 59 నెలల్లో చూశారు. జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు. అదే చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నింటికి ముగింపే. విశ్వసనీయతకు మరోసారి ఓటేసేందుకు మీరంతా సిద్ధమా?. గతంలో లేని విధంగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చా. రూ.2 లక్షల 70 వేల కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. 31 లక్షల ఇళ్ల పట్టాలు అక్కా చె÷-లలెమ్మల పేరుపై రిజిస్ట్రేషన్ చేశాం. ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చా. మీ ఓటు ఐదేళ్ల భవిష్యత్తు అని సీఎం జగన్ పేర్కొన్నారు.మేనిఫెస్టోకు విశ్వసనీయత తెచ్చి 99? అమలు జరిగింది ఈ పాలనలోనే. ప్రభుత్వ బడులు మారాయి, పిల్లల చదువులు మారాయి. లంచాలు లేని వివక్షలేని ఇంటివద్దకే పాలన, పెన్షన్, పౌరసేవలు, పథకాలు గతంలో ఎప్పుడూ లేవు' అని సీఎం జగన్ వివరించారు. ఒక్క నెల ఓపిక పట్టండి.. మీ బిడ్డ ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తొలి సంతకం పెడతా.. వాలంటీర్లు మళ్లీ మీ ఇంటికే వచ్చి పెన్షన్ ఇస్తారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ప్రకాశం జిల్లా కనిగిరి బహిరంగ సభలో మాట్లాడుతూ, ఈ ఎన్నికలు.. ఐదేళ్ల భవిష్యత్.. జగన్‌కు ఓటేస్తే.. పథకాలు కొనసాగింపు పొరపాటున బాబుకు ఓటేస్తే.. పథకాలకు ముగింపేనన్నారు. రూ.వెయ్యి పెన్షన్‌ను రూ.3వేలు చేసింది మీ బిడ్డ జగన్. 39 లక్షల మందికి మాత్రమే బాబు పెన్షన్ ఇచ్చాడు.. మీ బిడ్డ జగన్.. 66 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నాడు. లంచాలు, వివక్ష లేకుండా ఇంటి వద్దకే పెన్షన్ ఇస్తున్నాం. చంద్రబాబు పాపిష్టి కళ్ళు అవ్వాతాతలపై పడ్డాయి. నిమ్మగడ్డతో ఫిర్యాదు చేయించి పెన్షన్ అడ్డుకున్నాడు. బాబు హయాంలో పెన్షన్ల కోసం జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సివచ్చేది. చంద్రబాబు చేసిన పనివల్లే అవ్వాతాతలు ఎండలో బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పని లేదు.. ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా పెన్షన్లు ఇచ్చాం. అవ్వాతాతలకు ఇంటికే రూ.3000 పెన్షన్ పంపించాం అని సీఎం జగన్ పేర్కొన్నారు. పెన్షన్ల విషయంలో అవ్వాతాతలకు అన్యాయం జరిగింది. ఆ నెపాన్ని కూడా దుర్మార్గ చంద్రబాబు మనపై నెడుతున్నాడు. పెన్షన్ల విషయంలో రాజకీయం జరుగుతోంది. మీ జగన్ అధికారంలో ఉంటేనే.. పెంచిన అమ్మ ఒడి. మీ జగన్ అధికారంలో ఉంటేనే.. కాపునేస్తం, ఈబీసీ నేస్తం. మీ జగన్ అధికారంలో ఉంటేనే.. ఆసరా, చేయూత, సున్నా వడ్డీ. మీ జగన్ అధికారంలో ఉంటేనే.. రైతు భరోసా, సున్నావడ్డీ. చంద్రబాబు చేసేవన్నీ మాయలు, కుట్రలు. అప్పుడే సూపర్ సిక్స్‌లో పెన్షన్ హామీని ఎత్తేశాడు. చంద్రబాబును నమ్మడమంటే.. చంద్రముఖిని నిద్ర లేపడమే.. లకలకా లకలకా అంటూ పసుపుపతి రక్తం తాగుతాడు అంటూ సీఎం జగన్ దుయ్యబట్టారు.



# సింపతీ కోసం జగన్ తాపత్రయం

## ఓటమి భయంలో పడ్డ వైసిపి నేత

## ప్రకాశం ప్రచారంలో చంద్రబాబు విమర్శలు

ఒంగోలు,మే3 (ప్రజా మంటలు):
ఈ ఎన్నికల్లో సింపతి కోసం సీఎం జగన్ ప్రాదేయపడుతున్నారని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయనకు ఓటమి భయం పట్టుకుందని అన్నారు. అందుకే ఎదురుదాడికి దిగుతున్నారని అన్నారు. ప్రజలకు కూడా తెలిసిపోయిందని అన్నారు. పొదిలిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం జగన్, వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. గిద్దలూరు చెత్త మార్కాపురంలో బంగారం అవుతుందా అని ప్రశ్నించారు. శేషాచలం స్మగ్లర్ చెవిరెడ్డి కావాలా... ప్రజానాయకుడు మాగుంట కావాలో తెలుసుకోవాలని కోరారు. పింఛన్లు మొదలుపెట్టింది తెలుగుదేశం పార్టీనే అని తెలిపారు. పింఛన్ రూ. 200 నుంచి రూ. 2000 చేసిన ఘనత తమ పార్టీదని తెలిపారు. పింఛన్ల పంపిణీ విషయంలో సీఎస్ జవహర్ వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని మండిపడ్డారు. తండ్రి, బాబాయి చావును అడ్డుపెట్టుకొని గత ఎన్నికల్లో జగన్ పోటీ చేసి గెలిచారని చెప్పుకొచ్చారు. 2014 మంచి 2019 వరకు వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిగెత్తించానని తెలిపారు. నీళు లేని వెలిగొండ ప్రాజెక్టుకు జగన్ రిబ్బన్ కట్ చేశారని ఎద్దేవా చేశారు. 2024లో వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసి మార్కాపురం, పొదిలి ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. మార్కాపురాన్ని జిల్లాగా చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

# కాలువలకు నీళ్లివ్వలేని అసమర్థ ఎమ్మెల్యే

## ఉరవకొండ ప్రచారంలో పయ్యావుల విమర్శలు

ఉరవకొండ,మే3
(ప్రజా మంటలు):



తవ్విన కాలువలకు తూములెత్తి నీళ్లు ఇవ్వలేని అసమర్థుడు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అని ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ విమర్శించారు. రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గపు పాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ అన్నారు. మండలంలోని కోనాపురం, చిన్నముష్టూరు, లత్తవరం, లత్తవరం తండా, షేక్షానుపల్లి, రాచర్ల, రాచర్ల తండా గ్రామాలలో గురువారం కేశవ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. నాయకులు గజమాలతో సత్కరించారు. కేశవ్ మాట్లాడుతూ పనిచేసే వారికే ప్రజలు పట్టం కట్టాలన్నారు. టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ఐదేళ్లలో విశ్వేశ్వరరెడ్డి నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. తల్లికి వందనం పథకం కింద ఎంత మంది చదువుతున్న పిల్లలున్నా రూ.15వేలు ఇస్తామన్నారు. మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, పురుషోత్తం, మాజీ ఎంపీపీలు కుల్లాయప్ప, నాగేశ్వరరరావు, మాజీ సర్పంచు గోవిందు, నె÷-టటెంరాంబాబు, మదమంచి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ వన్నూరుస్వామి, ఓబన్న పాల్గొన్నారు. పట్టణంలోని వీరశైవ కల్యాణమండపంలో జనసేన, టీడీపీ సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి కేశవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైసీపీని సాగనంపాలన్నదే కూటమి లక్ష్యమన్నారు. ప్రతిపక్ష ఓట్లు చీలకూడదన్న లక్ష్యంతోనే జనసేన, టీడీపీ, బీజేపీ పొత్తు కుదుర్చుకున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలకోసం నిలబడిన వ్యక్తి పవనకల్యాణ్ అన్నారు. వైసీపీ నాయకుల వేధింపులతో పరిశ్రమలు జిల్లా నుంచి తరలిపోయాయన్నారు. జనసేన నియోజకవర్గ ఇనచార్జి గౌతమ్‌కుమార్, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రేగాటి నాగరాజు, జనసేన నాయకులు చంద్రశేఖర్, కేశవ, గోపాల్, నగేష్, రాజేష్, దేవేంద్ర పాల్గొన్నారు. వజ్రకరూరు మండలంలోని గూళ్లపాళ్యం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. కూడేరు: మండల పరిధిలోని ఇప్పేరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నుంచి పయ్యావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. చేరిన వారిలో కందేపల్లి చిన్నకేశవులు, కందేపల్లి ఈశ్వరయ్య, కందేపల్లి మారుతీ టీడీపీలో చేరారు.

# పెన్షన్‌దారులకు ఇన్ని వెతలా

## వారు ఇబ్బంది పడకుండా పంపిణీ చేయలేరా

## ఎపి సిఎస్‌కు చంద్రబాబు లేఖ



అమరావతి,మే3 (ప్రజా మంటలు):
పెన్షనర్లను ఇబ్బంది పెట్టేలా నిర్ణయాలు దారుణం అంటూ..ఏపీలో పెన్షన్ దారులు పడుతున్న ఇబ్బందులపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీఎస్ జవహర్ రెడ్డికి లేఖ రాసారు. పెన్షన్ దారుల ఇబ్బందుల గురించి లేఖలో ప్రస్తావించారు. పెన్షన్ కోసం లబ్దిదారులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తుండటంతో దీనిపై చంద్రబాబు స్పందించారు. పేదల ప్రాణాలతో రాజకీయం చేయడం ఏంటని సీఎస్ ను ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు పెన్షన్ దారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఒక రాజకీయ పార్టీకి కొమ్ము కాసేలా నిర్ణయాలు తీసుకోవడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ఈ నెల కూడా పెన్షన్ దారులను ఎండలో తిరిగేలా చేసి, ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పెన్షన్ డబ్బులు బ్యాంకుల్లో జమ చేయడం వల్ల వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండు టెండల్లో లబ్దిదారులు రోడ్లపై తిరగాల్సి వస్తుందని తెలిపారు. గత నెలలో ఎండలో సచివాలయాల చుట్టూ తిప్పారని.. ఇప్పుడు మళ్లీ బ్యాంకుల చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నారని లేఖలో ఆరోపించారు. రభుత్వ అధి కారులు బాధ్యతగా వ్యవహరిం చాలని, పింఛన్ దారులకు ఇబ్బందులు కలిగేలా నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. మండుటెండల్లో పెన్షన్ దారులను బ్యాంకులు చుట్టూ తిప్పుతూ నరకయాతన చూపిస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. పేదల ప్రాణాలతో రాజకీయం చేయొద్దని సూచించారు. పింఛన్ పేరుతో మారణ హోమాన్ని సృష్టిస్తున్నారని, ఏ1గా జగన్, ఏ2గా సీఎస్ అని చంద్రబాబు ఆరోపించారు. వెంటనే పింఛన్‌దారులకు ఇంటి వద్దనే నగదు పంపిణీ చేయాలని చంద్రబాబు లేఖలో డిమాండ్ చేశారు. గత నెలలో సచివాలయాల వద్ద పెన్షన్ల కోసం లబ్దిదారులు క్యూ కట్టడంతో ఈసారి నేరుగా బ్యాంకులో నగదు జమ చేశారు. అయితే, ఎలా చేసినా ఇబ్బందులు.. క్యూలో నిలబడడం తప్పలేదని పెన్షన్ దారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా పెన్షన్ డబ్బుల కోసం బ్యాంకులకు పోటెత్తడంతో రద్దీ నెలకొంది. ఈ క్రమంలో నగదు పంపిణీ బ్యాంకర్లకు సవాల్ గా మారగా.. క్యూలో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చిందని పెన్షన్ దారులు వాపోయారు. బ్యాంక్ సర్వీసుల గురించి అవగాహన లేని వృద్ధుల ఇబ్బందులు వర్ణణాతీతం. అలాగే, ఎక్కువ బ్యాంక్ ఖాతాలున్న వారు ఎందులో నగదు పడిందో తెలియక తలలు పట్టుకున్నారు. కొందరు అకౌంట్లు ఎక్కువ రోజులుగా వాడకంలో లేకపోవడంతో అవి డీయాక్టివేట్ అయ్యాయి. ఈ క్రమంలో వాటిని యాక్టివేట్ చేసుకోవాలని బ్యాంక్ అధికారులు సూచించగా.. దాని కోసం ఇబ్బందులు పడ్డారు. అసలే ఎండ తీవ్రతతో బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని చాలా మంది వాపోయారు. కొందరికి బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ లేకపోవడంతో.. కేవైసీ ఇబ్బందులు తలెత్తాయి. అయితే, పెన్షన్ దారులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేసినట్లు బ్యాంక్ అధికారులు చెబుతున్నారు.

# యువతను గంజాయి మత్తుకు బానిసలు చేశారు

## ముఠా కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

## వైకాపా ప్రభుత్వం తీరుపై మండిపడ్డ జనసేనాని



ఏలూరు,మే3(ఆర్ఎన్ఎ):
వైకాపా ప్రభుత్వం యువతను గంజాయి మత్తుకు బానిస చేసిందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్‌కు ఈ ఎన్నికలు ఎంతో కీలకమని, ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా కైకలూరులో నిర్వహించిన వారాహి విజయభేరి సభలో పవన్ ప్రసంగించారు. భవన నిర్మాణ కార్మికుల కోసం గళమెత్తిన పార్టీ జనసేన అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఠా కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు భయపడకుండా బతకాలన్నదే తన కోరికన్న పవన్.. సమస్యల పరిష్కార బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. 'వైకాపా పాలనలో 112 మంది జర్నలిస్టులపై దాడులు జరిగాయి. 430 కేసులు నమోదు చేశారు. మీడియాను కట్టడి చేసేందుకు జీవో నెంబర్ 1 తీసుకొచ్చారు. అసెంబ్లీలో చర్చ జరగకుండానే, భూములు దోచేసే చట్టం తీసుకొచ్చారు. మన ఆస్తి.. మనదని రుజువు చేసుకోవాలా?90 రోజుల్లో రుజువు చేసుకోకపోతే దోచుకుంటారా? వంద గజాల భూమి ఉన్న వ్యక్తి కూడా న్యాయం కోసం హైకోర్టు తలుపు తట్టాలా?' అని పవన్ ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే కైకలూరు నియోజకవర్గం లో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మిస్తానని హామీ ఇచ్చారు.



# సామాన్యులకు ధారాఘాతం

## ధరలదాడిపై కిమ్మనని పాలకులు

## ఎన్నికల వేళ పట్టింపులేని నేతలు



న్యూఢిల్లీ,మే 3 (ప్రజా మంటలు):
అడ్డూ అదుపు లేకుండా పెరుగుతన్న నిత్యావసరాల ధరలు సామాన్య,మధ్య తరగతి ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. బియ్యం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఉప్పు, పప్పు, నూనె, పెట్రోల్.. ఇలా అన్నింటి ధరలు అందనంతగా పెరిగిపోతున్నాయి. వీటికి తోడు మందుల ధరలు కూడా సైలెంట్‌గా పెంచేశారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు దాడి చేస్తున్నాయి. పెట్రో ధరలతో అన్నిరకాల వస్తువుల ధరలు దాదాపు రెండింతలు అయ్యాయి. చాయ్ సింగిల్ కనీసం 15 రూపాయలుగా అమ్ముతున్నారు. మూడేళ్లలో నెలసరి ఇంటి ఖర్చులు ఏకంగా 5 వేలు దాటేశాయి. ఈ ధరాఘాతంతో బతకలేక సామాన్యులు బెంబేలెత్తి పోతున్నారు. ఈ ధరలకు తోడు కరెంటు బిల్లులు, పెట్రోల్ బాదుడు కూడా అదనంగా వచ్చి చేరింది. మరింత అదనంగా జిఎస్టీ వాయిస్తోంది. ప్రభుత్వాలు ధరలను అరికట్టే చర్యలకు పూనుకోవడం లేదు. ధరలు పెరగడం సహజం అన్న ధోరణిలో ఉన్నారు. తమకు అందుబాటులో ఉన్న పెట్రోల్, గ్యాస్, విద్యుత్ తదితర వస్తువులపై వడ్డింపులు వేస్తూనే ఉన్నారు. ఎన్నికల్లో ధరలపై గట్టిగా మాట్లాడడం లేదు. దీనికితోడు జిఎస్టీ వడ్డింపులు శరాఘతంగా మారాయి. సామాన్యులు బతకడం దుర్లభంగా మారింది. ధరల పెరుగుదలను తలచుకుంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ఇంటి ఖర్చు సగటున నెలకు రూ.5వేలకు పైగా పెరిగింది. ప్రతి ఒక్కరిపైనా ఏటా 5 నుంచి 10 శాతం పెంపుతో అదనపు భారం తప్పదు. పంటలు దెబ్బతిని గ్రామాల్లో ఉపాధి కరవైంది. అటు పనుల్లేక, ఇటు ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. కందిపప్పు, మినప్పప్పు, పెసరపప్పుల ధరల్లో పెరుగుదల అధికంగా ఉంది. కరోనా సమయంలో ధరలు భారీగానే పెరిగినా తర్వాత కాస్త నెమ్మదించాయి. కొంతకాలంగా నిలకడగా సాగుతున్నాయి. గతంలో 3 నెలలకు రూ.333 ఉండే రీఛార్జ్.. ఇప్పుడు రూ.666కు చేరింది. దీనికి తోడు వై-ఫై రూపంలో నెలకు రూ.500 వరకు అదనపు భారం తప్పట్లేదు. కేబుల్ టీవీ ఖర్చు రూ.250 వరకు అదనం. ఒక్కో ఓటీటీ ఛానెల్‌కు సగటున రూ.500 చొప్పున నాలుగు తీసుకున్నా.. రూ.2 వేలు. అంటే నెలకు రూ.166 చొప్పున ఖర్చవుతుంది. ఒక్కో కుటుంబంపైనా మొబైల్, కేబుల్ బిల్లుల రూపంలోనే నెలకు రూ.600 వరకు అవుతోంది. వై-ఫై, ఓటీటీ తీసుకున్న కుటుంబాలకు నెలకు రూ.1,000 చొప్పున తప్పట్లేదు. 2019 మధ్యలో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.600 వరకు ఉంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.1150అయింది. అప్పటితో పోలిస్తే రాయితీ కూడా తగ్గిపోయింది. రూ.15 చొప్పునే నామమాత్రంగా ఇస్తున్నారు. నెలకు ఒక సిలిండర్ లెక్కన చూస్తే.. ఒక్కో కుటుంబంపై రూ.372 చొప్పున భారం పడుతోంది. ఇక పెట్రోల్, డీజిల్ ధరల గురించైతే చెప్పనక్కర్లేదు. చిరు వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులకు ద్విచక్రవాహనం భారమైపోయింది. నెలకు సగటున 25 లీటర్ల పెట్రోల్ లెక్కన చూసినా రూ.1,100 వరకు ఖర్చు పెరిగింది. 2019లో రూ.75లోపు ఉన్న పెట్రోల్ ధర.. ప్రస్తుతం రూ.121 వరకు చేరింది. లీటరుకు రూ.45కు పైగానే పెరిగింది. ఇంజిన్ ఆయిల్ ధర రూ.300 నుంచి రూ.500కు చేరింది. ఇప్పుడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో మరింత ఎగిశాయి. బ్రాండెడ్ టీపొడి ధర గతంలో కిలో రూ.540 ఉండేది. ప్రస్తుతం రూ.780 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం, యాలకులు, తులసి, అశ్వగంధ వంటి ఉత్పత్తులతో తయారయ్యే ఒక సంస్థ టీ పొడి.. 2019లో రూ.380 ఉండేది. ప్రస్తుతం రూ.800కు పైనే చేరింది. లీటర్ పాల ధర గతంలో రూ.55 నుంచి రూ.58 మధ్య ఉండేది. ఇప్పుడు సగటున రూ.64 నుంచి రూ.68 వరకు ఉంది. నెలకు 30 లీటర్లకు రూ.300 అదనంగా ఖర్చవుతోంది. సబ్బులు, డిటర్జెంట్ ఉత్పత్తుల ధరలూ.. 30 శాతం వరకు పెరిగినట్లు అంచనా. వీటికి తోడు ఇంట్లో వాడే ఒంటి సబ్బులు,ఫేస్‌క్రీమ్, షాంపూ ధరలూ రెట్టింపయ్యాయి. పాత్రలు కడిగే సబ్బు ధర మూడేళ్ల కిందట రూ.45 ఉంటే ఇప్పుడు అది 51 శాతం పెరిగి.. రూ.68కి చేరింది. టూత్‌పేస్ట్ ధర 2019లో రూ.79 ఉంటే.. ఇప్పుడు రూ.96 రూపాయలకు పైగానే ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రకాల వస్తువులపైనా ధరలు పెరిగాయి. ఉల్లిపాయల ధరలు 25కిలో దగ్గర స్థిరంగా ఉన్నాయి. అయితే ఈ ధరలపై పాలకులు పట్టించుకోవడం లేదు. వ్యాపారులు ఏ వస్తువు రేటు ఎందుకు పెంచుతున్నారో ఎవరికీ తెలియడం లేదు.

# ఎపి, కర్నాటక, తమిళనాడుల్లో వర్షాలకు చాన్స్

## భారత వాతావరణ శాఖ చల్లని శుభవార్త



అమరావతి,మే3 (ప్రజా మంటలు):
భారత వాతావరణ శాఖ చల్లని శుభవార్త చెప్పింది. ఎండల నుంచి అల్లాడిపోతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వర్ష కబురు అందించింది. ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడులలో శుక్రవారం సాయంత్రం, రాత్రి వర్షం కురవనుందని ఐఎండీ అధికారులు తెలిపారు. ఏపీలో రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన ఉంది. దక్షిణ కోస్తాంధ్రలోనూ కొన్ని చోట్ల చినుకులు పడనున్నాయి. క్షిణ ఛత్తీస్ గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు తెలంగాణ, రాయలసీమ మీదుగా సముద్ర మట్టానికి సగటు 0.9 కిలోమీటర్ల ఎత్తులో అల్పపీడన ద్రోణి విస్తరించి ఉంది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు కర్ణాటక నుంచి తమిళనాడు, ఏపీ వైపు వీచనున్నాయి. మరికొన్ని గంటల్లో మిజోరం, అరుణాచల్ ప్రదేశ్‌లలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. ఏపీలోనూ కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. తెలంగాణలో శుక్రవారం నాడు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొమురంభీం ఆసిఫాబాద్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వేడి గాలులు వీచాయి. వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లోనూ భానుడి ప్రభావం అధికంగా ఉండటంతో వాతావరణ అధికారులు ఈ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడా భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఉప-హిమాలయ ప్రాంతాల్లో, పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్, ఒడిశాలో హీట్ వేవ్ ఎక్కువగా ఉంది. ఆంధ్ర ప్రదేశ్ లోని తీర ప్రాంత జిల్లాల్లో, యానాం, రాయలసీమ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళతో పాటు కర్ణాటకలో ఎండల ప్రభావం అధికంగా ఉండనుంది. వడగాలుల ప్రభావం అధికంగా ఉంటుందని, ప్రజలు అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని అధికారులు సూచించారు.

# పిఠాపురంలో వేడెక్కిన రాజకీయం

## ముద్రగడ వ్యాఖ్యలపై కూతురు అభ్యంతరం

## పేరు మార్చుకోవడానికి సిద్దంగా ఉండాలన్న వర్మ

కాకినాడ,మే3 (ప్రజా మంటలు):
సవాళ్లు ప్రతి సవాళ్లతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు హీటెక్కాయి. పిఠాపురం నియోజకవర్గంలో నేతల మధ్య డైలాగ్ వార్ తీవ్రస్థాయికి చేరింది. వైసీపీ అభ్యర్థి వంగా గీతకు.. కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. వైసీపీలో చేరిన తర్వాత నోటికొచ్చి మాట్లాడుతూ.. ఆఖరికి జనసేన అధినేత, పిఠాపురం అభ్యర్థి పవన్ కల్యాణ్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడంతో.. ఆయన కూతురు క్రాంతి రంగంలోకి దిగారు. అలా మాట్లాడటం సరికాదని సూచించారు. ఆ వెంటనే పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ లైన్‌లోకి వచ్చారు. ముద్రగడ పద్మనాభంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పిఠాపురం నుంచి పవన్ కల్యాణ్ గెలవడని ముద్రగడ పద్మనాభం ఛాలెంజ్ చేశారు. ఒకవేళ పవన్ కల్యాణ్ గెలిస్తే తన పేరు మార్చుకుంటానని ప్రకటించారు. ముద్రగడ పద్మనాభ రెడ్డిగా మార్చుకుంటానని వివరించారు. ఆ అంశంపై వర్మ స్పందిస్తూ.. ఎన్నికల వరకు ఎందుకు ఇప్పుడే సిద్ధంగా ఉండు అని ప్రతి సవాల్ విసిరారు. 'పిఠాపురంలో పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో గెలవడం పక్కా. ముద్రగడ చెబితే పట్టుమని వంద ఓట్లు కూడా పడవు. పవన్ కల్యాణ్‌ను ఓడిస్తామని పగటి కలలు కంటున్నారు. వైసీపీలో ఎదుర్కొన్న అవమానాలను ముద్రగడ మరచిపోయినట్టున్నారు. పిఠాపురంలో పవన్ గెలవడం ఖాయం.. ఇంటి పేరు మార్చుకోవడానికి ముద్రగడ సిద్ధంగా ఉండాలి. ముద్రగడ కూతురే ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండించింది. జగన్ మెప్పు కోసం పవన్‌ను తిట్టి ఎంతకాలం పబ్బం గడుపుతారు అని' వర్మ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తనపై కూతురు చేసిన వ్యాఖ్యలను ముద్రగడ ఖండించారు. కూటమి నేతలు కూతురి చేత విమర్శలు చేయించారని మండిపడ్డారు. పిఠాపురంలో కాపు ఓటు బ్యాంకు ఎక్కువగా ఉంది.

## శంషాబాద్ సమీపంలో భారీగా ఆభరణాల పట్టివేత

హైదరాబాద్,మే 3 (ప్రజా మంటలు): శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో పోలీసులు భారీగా బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారులో 34 కిలోల బంగారం, 40కిలోల వెండి ఆభరణాలు పట్టుబడ్డాయి. సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ఆభరణాలను ముంబయి నుంచి హైదరాబాద్ తీసుకొస్తున్నట్టు గుర్తించారు.

## రోహిత్ వేముల ఆత్మహత్య కేసు విచారణను ముగించిన హైకోర్టు

హైదరాబాద్,మే3 (ప్రజా మంటలు): సెంట్రల్ వర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య కేసు విచారణను తెలంగాణ హైకోర్టు ముగించింది. దీనిపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అందుకు నిరసనగా శుక్రవారం యూనివర్శిటీ వద్ద వారు ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. దీంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు వెంటనే అప్రత్తమై.. యూనివర్శిటీ వద్దకు చేరుకున్నారు. అలాగే అదనపు బలగాలను సైతం అక్కడ మోహరించారు. హెచ్‌సీయూ మాజీ వీసీ పి.అప్పారావు పిటిషన్‌పై హైకోర్టు విచారణను ముగించింది. రోహిత్ వేముల ఆత్మహత్య చేసు కున్నారు. 2016లో ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ హెచ్‌సీయూ మాజీ వీసీ అప్పారావు.. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే రోహిత్ వేముల ఆత్మహత్యతో నాటి వీసీ అప్పారావుకు సంబంధం లేదని గచ్చిబౌలి పోలీసులు స్పష్టం చేశారు. అలాగే రోహిత్ ఆత్మహత్యతో బీజేపీ నేతలు.. బండారు దత్తాత్రేయ, రాంచందర్‌రావు, స్మృతి ఇరానీకి సైతం సంబంధం లేదని పోలీసు లు పేర్కొన్నారు. అయితే కులానికి సంబంధించిన సర్టిఫికెట్ విషయంలోనే రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసు లు తమ దర్యాప్తులో తేలిందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గచ్చిబౌలి పోలీసుల తుది నివేదిక ఆధారంగా తెలంగాణ హైకోర్టు వేముల ఆత్మహత్య కేసు విచారణను ముగించింది.

## వడదెబ్బకు వ్యక్తి మృతి

యాదాద్రి భువనగిరి,మే3 (ప్రజా మంటలు): రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగకు ప్రజలు విలవిలలాడిపోతున్నారు. మండుటెండలకు ఉక్కపోత కూడా తీవ్రమైంది. దీంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ దెబ్బకు పలువురు మృత్యువాత పడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారం గ్రామానికి చెందిన నర్సిరెడ్డి(63) అనే వ్యక్తి వడదెబ్బతో మృతి చెందాడు. భువనగిరి పట్టణంలో బైక్ పై వెళ్తుండగా ఎండ దాటికి తట్టుకోలేక కుప్పకూలిన నర్సిరెడ్డిని స్థానికులు దవాఖానకు తరలించారు. అప్పటికే నర్సిరెడ్డి చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. పూర్తి వివవరాలు తెలియాల్సి ఉంది.

## ఎండల తీవ్రత.. బంకుల్లో కూలర్ల ఏర్పాటు

ఖమ్మం,మే3 (ప్రజా మంటలు): జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు నడినెత్తిన నిప్పులు కురిపిస్తున్నాడు. జిల్లా మొత్తం 45 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వారం నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ఎండతీవ్రతకు వడ గాడ్పులు కూడా తోడయ్యాయి. కోల్ బెల్ట్ ఏరియాలో పరిస్థితి మరీ దారుణంఎండలకు బయటకు రావాలంటే ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రతకు పెట్రోల్ బంక్‌లో ప్రత్యేకంగా కూలర్స్ ఏర్పాటు చేశారు. వడగాల్పుల నుంచి వాహనదారులకు ఈ కూలర్స్ కాస్త ఉపశమనం కలిగిస్తున్నాయి.

# సిద్ధిపేట అభివృద్ధి కాలేదనడం హాస్యాస్పదం

- గ్యారెంటీలు..రుణమాఫీ అమలు చేస్తే సిద్ధిపేటలో సీఎం రేవంత్‌కు సన్మానం చేస్తా
- ఆయన సవాల్ స్వకీరిస్తున్నా
- అప్పుడే రాజీనామాతో సిద్దంగా ఉంటా
- హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిని చేసే కుట్ర
- మళ్లీ రంగంలోకి దిగిన చంద్రబాబు
- కాంగ్రెస్ మాటున రాజకీయాలు
- ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట/ హుస్నాబాద్ (ప్రజా మంటలు): సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి స్పష్టం చేశారు. పంద్రాగస్టులోగా ఆరు గ్యారెంటీలు, రూ. 2 లక్షల రుణమాఫీ అమలు చేస్తే.. రాజీనామా చేస్తానని ఆయన తేల్చిచెప్పారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు.కాంగ్రెస్ బాండ్ పేపర్ బౌన్స్ అయిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.ప్రెస్ అకాడమీ చైర్మన్ వద్ద ఇద్దరి రాజీనామాలు ఉంచుదాం. రేవంత్ రెడ్డి రాజీనామా లేఖ ఇచ్చిన 10 నిమిషాల్లోనే తన రాజీనామా లేఖ పంపిస్తాను. స్పీకర్ ఫార్మాట్‌లోనే రాజీనామా లేఖ అందజేస్తాను. పంద్రాగస్టు లోగా ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ చేస్తే రాజీనామా ఆమోదించుకుంటాను. ఆ తర్వాత సిద్దిపేటకు రేవంత్ రెడ్డిని పిలిపించి శాలువాతో సన్మానం చేస్తానని పేర్కొన్నారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఆ గడువు దాటిపోయినా పత్తా లేదన్నారు. ఇప్పుడేమో పంద్రాగస్టు లోగా చేస్తామని చెబుతున్నారు. పదవుల కోసం చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. రాష్ట్రాన్ని తెచ్చింది సిద్దిపేటనే.. తెలంగాణ రావడానికి కేసీఆరే కారణం. తెలంగాణకు, కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి రుణపడి ఉండాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని రేవంత్ రెడ్డి చెప్పడం పచ్చి అబద్ధం.. ఇది ప్రజలందరికీ తెలుసు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.తెలంగాణ తెచ్చిందే సిద్ధిపేట .. సిద్దిపేట లేకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. అభివృద్ధి అంతా మెదక్ లోనే జరిగిందన్న సీఎం రేవంత్ రెడ్డి...ఇపుడు సిద్దిపేటకు బీఆర్ఎస్ చేసిందేమి లేదంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాడంటే సిద్ధిపేట పుణ్యమేనని చెప్పారు. తన చాలెంజ్ ను సీఎం రేవంత్ ఇప్పటికీ స్వీకరించలేదన్నారు. ఆరుగ్యారంటీలు అమలు చేస్తే రాజీనామా చేయడానికి సిద్ధమని మరోసారి చెప్పారు. పదవుల కోసం విలువలు లేని రాజకీయాలు చేయనన్నారు .తన పదవి కంటే ప్రజల మేలే ముఖ్యమన్నారు. రేవంత్ రెడ్డి నాడు బాండ్ పేపర్లు, ఇపుడు గాడ్ ప్రామిస్ లు చేస్తున్నారని చెప్పారు. ఒకరు దేవున్ని చూయించి మరొకరు దేవునిపై ఒట్టేసి ఓట్లడుగుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందన్నారు హరీశ్ రావు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములు విలువ బాగా పడిపోయాయని.. రాష్ట్రం దివాల తీసిందని ముఖ్యమంత్రి అనడంతో పెట్టుబడులు రాకుండా పోయాయన్నారు. దీంతో రాష్ట్ర ఆదాయం పడిపోయిం దన్నారు.

**హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిని చేసే కుట్ర**

ఆరు గ్యారంటీల్లో ఒకటే ఇచ్చి ఐదు అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని చేయడానికి చంద్రబాబు లాంటి వాళ్లు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వాళ్ల ఆటలు సాగకూడదంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. రేవంత్‌రెడ్డిని అడ్డం పెట్టుకుని బాబు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేటలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాధారణంగా చెక్ బౌన్స్ అయితే శిక్ష పడుతుందని.. కాంగ్రెస్ బాండు పేపర్లు బౌన్స్ అయ్యాయని వ్యాఖ్యానించారు. ఆ పార్టీకి శిక్ష పడాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు గ్యారంటీల అమలుకు దేవుడిపై ఒట్టు పెట్టి మోసం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చాక నిత్యావసర సరకుల ధరల కొండెక్కాయి. పింఛన్లు రావడం లేదు. దళిత బంధు, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి పింఛను అన్నీ పోయాయి. మహాలక్ష్మి గ్యారంటీ మహా మోసం. మీరు వినోద్‌ను గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచి హామీలను అమలు చేస్తాం. ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లలో కరీంనగర్‌కు ఏం చేశారు? భాజపా పదేళ్ల పాలనలో పప్పు, ఉప్పు ధరలు పెరిగాయి. కేసీఆర్ తెలంగాణకు శ్రీరామ రక్ష. ఆయన పాలనలో మెడికల్ కాలేజీలు, నిరంతర కరెంటు, కేసీఆర్ కిట్టు.. ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యాయి. ప్రాజెక్టులు కట్టింది.. పనులు చేసింది మేమే. ప్రత్యేక ప్యాకేజ్ ఇచ్చి గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 4 నెలల్లోనే కరెంటు మోటార్లు కాలుతున్నాయి. తండాలను పంచాయతీలు చేసింది.. లంబాడీలకు మంత్రి పదవి ఇచ్చింది మేమే. గిరిజనులకు కేసీఆర్ పోడు పట్టాలిచ్చారు.. రేవంత్ చేసిందేమీ లేదు. అబద్దాలు చెప్పి మోసం చేసిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఇవి తెలంగాణ భవిష్యత్, తలరాతను మార్చే ఎన్నికలని హరీశ్ రావు అన్నారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటే అమలుచేసి ఐదు అమలు చేశామని అబద్ధం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిద్దిపేట జిల్లా అక్కంపేటలో కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతుగా హరీశ్ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్నవస్త్రం కోసం పోతే ఉన్న వస్త్రం పోయినట్లు అయిందన్నారు. చెక్‌బౌన్స్ అయితే శిక్ష పడుతుంది.. కాంగ్రెస్ బాండు పేపర్లు బౌన్స్ అయ్యాయి. అందుకు కాంగ్రెస్‌కు శిక్ష పడాలని చెప్పారు. సీఎం రేవంత్ ఇప్పుడు సిగ్గులేకుండా దేవుడిపై ఒట్టు పెట్టి మోసం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నీ గోవిందా గోవిందా పాటలా మారాయి. దళిత బంధు, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి పింఛను అన్నీ గోవిందా. మహాలక్ష్మి గ్యారంటీ మహా మోసం. ఈ ఎన్నికల్లో వినోదన్నను గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచి హామీలను అమలు చేస్తాం. ఆయన అభివృద్ధి సాధకుడు. గత ఐదేండ్లలో కరీంనగర్‌కు బండి సంజయ్ ఏం చేశాడు?, బీజేపీ పదేండ్ల పాలనలో ఉప్పు, పప్పు ధరలు పెరిగాయి.తెలంగాణకు కేసీఆర్ శ్రీరామ రక్ష. సాగునీళ్లు, మెడికల్ కాలేజీలు, నిరంతర కరెంటు, కేసీఆర్ కిట్టు.. ఎన్నో సంక్షేమ పథకాలు కేసీఆర్ పాలనలో అమలయ్యాయి. కాంగ్రెస్ అడ్డుకున్నా పట్టుబట్టి గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశాం. హస్తం పార్టీ వచ్చాక అంతా రివర్స్ అయింది. కరెంటు మీటర్లు కాలిపోతున్నయ్, రిపేరుకు రూ.10 వేలు ఖర్చవుతోంది. గిరిజనులకు కేసీఆర్ పోడు పట్టాలిచ్చుండు. రేవంత్ చేసిందేమీ లేదు. గుంపు మేస్త్రీకి మాటలెక్కువ.. చేతలు తక్కువ. గుంపు మేస్త్రీ గూబ పలగాలంటే కారు గుర్తుకు నొక్కాలి. ఎవరు మనకు మేలు చేశారో వాళ్లను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ముసలోళ్లు కేసీఆర్ ఇచ్చిన కంటివెలుగు కళ్లద్దాలు పెట్టుకుని మూడో నంబరు బటన్ నొక్కాలి.' అని హరీశ్ రావు అన్నారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ కూడా పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ వైఎస్ అవినాశ్‌కు ఊరట

## దస్తగిరి పిటిషన్ రద్దు చేసిన హైకోర్టు

హైదరాబాద్,మే3 (ప్రజా మంటలు): వైఎస్ వివేకా హత్య కేసులో శుక్రవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ హైకోర్టులో వైఎస్ అవినాష్ రెడ్డికి ఊరట లభించింది. ఆయన బెయిల్ రద్దు చేయాలని దాఖలైన పిటిషన్ ను హైకోర్టు కొట్టేసింది. అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని ఈ కేసులో అప్రూవర్ గా మారిన దస్తగిరి తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తున్నారని.. బెయిల్ రద్దు చేయాలని కోరారు. దస్తగిరి తరఫున జై భీమ్ రావ్ భారత పార్టీ అధ్యక్షులు జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం ఈ పిటిషన్ రద్దు చేస్తూ.. అవినాష్ రెడ్డికి బిగ్ రిలీఫ్ ఇచ్చింది. ఈ క్రమంలో ఎన్నికల వేళ ఆయనకు భారీ ఊరట దక్కింది. అలాగే, ఇదే కేసులో అవినాష్ తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. ఇక, ఉదయ్ కుమార్ రెడ్డి, సునీల్ కుమార్ యాదవ్ బెయిల్ పిటిషన్ ను కోర్టు కొట్టేసింది. కాగా, వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దస్తగిరి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## కాళేశ్వరంతో పెద్దపల్లికి లాభం లేదు

**కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టారు**
**కుటుంబానికి దోచిపెట్టిన ఘనుడు కెసిఆర్**
**పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ విమర్శలు**



ధర్మపురి,మే3 (ప్రజా మంటలు): కాళేశ్వరంతో పెద్దపల్లికి ఉపయోగం ఏమీ లేదని, పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. ధర్మపురిలో జనజాతర సభలో మాట్లాడిన ఆయన.. పెద్దపల్లికి కాకా వెంకటస్వామి ఎంతో కృషి చేశారని చెప్పారు. కాకా హయాంలోనే పెద్దపల్లి సెగ్మెంట్ అభివృద్ధి జరిగిందని అన్నారు. కాకా ప్రపోజ్ చేసిన ప్రాణహిత చేవెళ్లను కేసీఆర్ పక్కన పెట్టి.. కమిషన్ల కోసం కేసీఆర్ కాళేశ్వరం కట్టారని ఆరోపించారు. గోదావరి నీళ్లను మనకు దక్కకుండా చేశారు.. ఇక్కడి వాళ్లకు నీళ్లు లేకుండా మళ్లించుకుపోయారని విమర్శించారు. కాళేశ్వరంతో పెద్దపల్లికి ఉపయోగం ఏమీ లేదన్నారు. తాను సొంతంగా 500 మందికి ఉద్యోగాలిప్పించానని గడ్డం వంశీకృష్ణ చెప్పారు. కేంద్రం నుంచి తనకు 6 పేటెంట్లు లభించాయన్నారు. ఎంపీగా గెలిచి నియోజకవర్గానికి నిధులు తీసుకొస్తానని చెప్పారు. పెద్దపల్లికి ప్రభుత్వ సంస్థలను తీసుకొచ్చే బాధ్యత తనదన్నారు. పంద్రాగస్టు కల్లా రుణమాఫీ చేసి తీరుతామని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేసీఆర్ పై చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ విమర్శలు చేశారు. తెలంగాణ వచ్చాక కేవలం కేసిఆర్ ఫ్యామిలీ ఆస్తులు పెరిగాయని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారని ఫైర్ అయ్యారు. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ కు చెంప దెబ్బ కొట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ఉన్నప్పుడు గ్యాస్ ధర రూ. 460 ఉంటే మోదీ వచ్చాక రూ. 12వందలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సీఎం రేవంత్ రెడ్డి రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చారని చెప్పారు. కాంగ్రెస్ లీడర్ల పై ఒత్తిడి తేవడానికే ఈడి పని చేస్తుందని తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో కాంగ్రెస్ పార్టీ జనగర్జన సభలో వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. ఎలక్షన్ కోడ్ రావడం వల్ల కొన్ని స్కీంలు ఆగిపోయాయని తెలిపారు. రుణమాఫీ చేస్తే కాంగ్రెస్ గెలుస్తుందనే పీఎం మోదీ ఆపించారని చెప్పారు వివేక్ వెంకటస్వామి. ఎలక్షన్ అయిపోగానే ఖచ్చితంగా బ్యాంకర్లతో మాట్లాడి రుణమాఫీ చేస్తామని తెలిపారు. బీజేపీ రాముడి పేరు చెప్పి ఓట్లు అడుగుతుందని విమర్శించారు. కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ప్రజా సేవ చేయడానికే వంశీ వస్తున్నారని కాకాకు అండగా ఉన్నట్టే వంశీకి ఉండి గెలిపించాలని వివేక్ వెంకటస్వామి కోరారు.

## ఇచ్చిన హామీలు అమలు కాలేదు..

# కొత్త హామీలా! – కిషన్‌రెడ్డి



హైదరాబాద్,మే3 (ప్రజా మంటలు): ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో హామీలను అమలు చేయకపోయినా, అమలు చేసినట్లు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి హస్తం గుర్తును కాకుండా, గాడిద గుడ్డును నెత్తిన పెట్టుకుని ఊరేగుతున్నారని ఎద్దేవా చేశారుఒనీని బజీఎష్ట్రజీ వశ్రీవఃఇబితినీనిబ 2024 : సీఎం రేవంత్‌రెడ్డి ఐదు నెలల్లోనే అవినీతి మార్కు చూపిస్తున్నారని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ఐదు గ్యారంటీలు అమలు చేశామని, గాడిద గుడ్డు పట్టు కుని తిరుగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు హోర్డింగ్స్ పెట్టుకున్నారని, ఏ ఒక్క మహిళా సం ఘానికి అయిన రుణాలు ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు.అమిత్ షా మాటలను మార్ఫింగ్ చేయడం– దేశ భద్రతకు సంబంధించిన అంశం స్టీల్‌ప్లాంట్‌పై రేవంత్‌రెడ్డి మాట ఇచ్చిన విధంగానే, గతంలో కేసీఆర్ హామీ ఇచ్చారని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. రైల్వేలపై మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదని ఆయన దుయ్యబట్టారు. ఇప్పటికే సైనిక్ స్కూల్ మంజూరైందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ, సీఎంను ప్రశ్నిస్తున్నానని, ఏం మార్పు మె?దలైందో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ పాలన పోయి, సోనియాగాంధీ కుటుంబ పాలన వచ్చిందని దుయ్యబట్టారు.ఒక్క రేషన్ కార్డు అయిన ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందా? అని కిషన్‌రెడ్డి నిలదీశారు. 58వేల కోట్లతో మూసీ అభివృద్ధి ఎక్కడ జరిగిందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కర్త కర్మ క్రియ తెలంగాణ బీజేపేనని, కానీ రీజినల్ రింగ్ రోడ్డును కాంగ్రెస్ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుందన్నారు. కౌలు రైతులకు 12వేలు, రైతు భరోసా 15వేలు, 5 వందలకు గ్యాస్ సిలిండర్ ఎంత మందికి ఇచ్చారని నిలదీశారు.ఉచిత విద్యుత్ ఎక్కడా అమలు జరగడం లేదని, కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. ప్రగతి భవన్ కంచెలు కూల్చారు తప్పితే, ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపలేదని, ఏ ఒక్క రోజు ముఖ్యమంత్రి ప్రజావాణిలో పాల్గొనలేదని ఆయన తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్?కు లేదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీజేపీపై బురద చల్లుతున్నారని ఆయన మండిపడ్డారు. "లోక్‌సభ ఎన్నికల కోసం తెలంగాణ కాంగ్రెస్ విడదల చేసిన మేనిఫెస్టోలో పస లేదు. రాహుల్ గాంధీ ఎట్లాగూ ప్రధాని కారని తెలిసే ఇష్టమొచ్చినట్లు హామీలు ఇస్తున్నారు. ఆరు గ్యారంటీల అమలపై రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. తెలంగాణలో మెజార్టీ సీట్లను బీజేపీ గెలవబోతుంది. బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు ముందే చేతులు ఎత్తేసింది.

## ఒక్కరి ముందు భాజపా మొత్తం తలవంచింది

**– ఆడబిడ్డలు ఓడిపోయారు.. అతడే గెలిచాడు'**
**– బ్రిజ్ భూషణ్ కుమారుడికి టికెట్‌పై రెజ్లర్ సాక్షి భావోద్వేగం**



న్యూఢిల్లీ (ప్రజా మంటలు): మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న భాజపా ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌కు ఈ లోక్‌సభ ఎన్నికల్లో భాజపా టికెట్ నిరాకరించిన విషయం తెలిసిందే. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కైసర్‌గంజ్ స్థానంలో కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌ను బరిలోకి దింపింది. ఈ ప్రకటనపై ప్రముఖ రెజ్లర్, ఒలింపిక్ పతక విజేత సాక్షి మలిక్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ భావోద్వేగభరిత పోస్ట్ పెట్టారు. ఈ దేశ ప్రభుత్వం అంత బలహీనంగా ఒక్క వ్యక్తి ముందు లొంగిపోయిందా?అని నిలదీశారు."ఈ దేశ ఆడబిడ్డలు ఓడిపోయారు. బ్రిజ్ భూషణ్ గెలిచాడు. ఆయనకు వ్యతిరేకంగా మేమంతా మా కెరీర్‌లను పణంగా పెట్టి పోరాడాం. ఎండనకా.. వాననకా.. ఎన్నో రోజులు రోడ్లపై నిద్రించాం. అయినా ఆయనను ఇంతవరకు అరెస్టు చేయలేదు. మేం న్యాయం తప్ప ఇంకేం డిమాండ్ చేయట్లేదు. అరెస్టు విషయం పక్కనబెట్టండి. ఈ రోజు ఆయన కుమారుడికి ఎన్నికల్లో టికెట్ ఇచ్చారు. ఈ నిర్ణయంతో మీరు (భాజపాను ఉద్దేశిస్తూ) కోట్లాది మంది అమ్మాయిల మనోధైర్యాన్ని దెబ్బతీశారు. కేవలం ఒకే ఒక్క కుటుంబానికి టికెట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఉందంటే.. ఒక వ్యక్తి ముందు ఈ దేశ ప్రభుత్వం అంత బలహీనపడిందా? శ్రీరాముడి పేరుతో ఓట్లు మాత్రమే కావాలా? ఆయన చూపిన బాటలో నడవరా?" అని సాక్షి ప్రశ్నించారు.కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానానికి వరుసగా మూడు పర్యాయాలుగా బ్రిజ్‌భూషణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ గతేడాది జనవరిలో సాక్షి మలిక్, బజ్‌రంగ్ పునియా, వినేశ్ ఫొగాట్ సహా అగ్రశ్రేణి రెజ్లర్లు ఆయనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఆయనపై పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఈ క్రమంలోనే తాజా ఎన్నికల్లో భాజపా హైకమాండ్ ఆయనను పక్కనబెట్టింది.కానీ, యూపీలో అతిపెద్ద బాహుబలి నేతల్లో ఒకరిగా బ్రిజ్‌భూషణ్‌కు పేరుంది. భారీ సంఖ్యలో కేసులు ఉన్నప్పటికీ.. ఎంపీగా ఏకంగా ఆరుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. విద్యా సంస్థలు, అఖాడాలు నిర్వహిస్తూ యువతలో పాపులారిటీ సంపాదించారు. యూపీలోని గోండా చుట్టుపక్కల అరడజను జిల్లాలో ఆయన హవా కనపడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే కైసర్‌గంజ్ స్థానంలో పార్టీ ఆయన కుమారుడికి అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.బ్రిజ్‌భూషణ్ చిన్న కుమారుడైన కరణ్ ప్రస్తుతం యూపీ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే తొలిసారి. ఇక, మరో కుమారుడు ప్రతీక్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. కుమారుడికి టికెట్ ఇవ్వడంపై బ్రిజ్‌భూషణ్ స్పందిస్తూ.. పార్టీ కంటే ఎవరూ ఎక్కువ కాదని, నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని తెలిపారు.

## షుగర్ ఫ్యాక్టరీ భూముల్లో

# రియల్ దందా

**సిఎం రేవంత్‌పై మండిపడ్డ ధర్మపురి అర్వింద్**

నిజామాబాద్,మే3(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో మూతబడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరుస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చెరకు రైతులను మోసం చేస్తోందని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ విమర్శించారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం గన్నారంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ధర్మపురి అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూతబడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు రూ.42వేల కోట్లు బ్యాంకులకు చెల్లించేందుకు జరుగుతున్న యత్నాలను ఆయన బయటపెట్టారు. రూ.600 కోట్ల అప్పు ఉంటే రూ.42 వేల కోట్లు ఎలా కడతారని ప్రశ్నించారు. ఇది పూర్తిగా ఎన్నికల స్టంట్ అని విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీ భూముల్లో రియల్ ఎస్టేట్ దందా చేసేందుకే రేవంత్ రెడ్డి హడావుడిగా బకాయిల విడుదలకు బ్యాంకర్లతో చర్చిస్తున్నారని ధర్మపురి అర్వింద్ విమర్శించారు. రేవంత్ రెడ్డి రియల్‌ఎస్టేట్ ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం రైతులకు రుణమాఫీ జరగదని వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్‌కు ప్రజలు, ఓటర్లు గుర్తుకొస్తారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలు.. ఆరు గుడ్లలాంటివి అని.. అవి ఎప్పుడు పొదుగుతాయో తెలియవని విమర్శించారు. రైతులకు భరోసా కల్పిస్తామని చెప్పి.. రైతుబంధును బంద్ చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు.



EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com